@vaartanews @mvnewstv
www.mivaartanews.com
TGBIL/25/A0512
AP EDITION
# మన వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
విజయవాడ
గురువారం 20 ఆగస్టు 2026
సంపుటి : 2
సంచిక : 260
పేజీలు : 8 వెల : 5/-

వార్త తెలుగు డిజిటల్ దినపత్రిక
విలేకరులు కావలెను
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
96763 94932

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న
మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్‌లు,
నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

## వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ
# అతిపెద్ద స్కామ్



- ద్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు: చంద్రబాబు
- గ్రూప్-1 నియామకాల్లో భయంకరమైన అక్రమాలు జరిగాయి
- అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు
- వైఎస్సార్సీపీ హయాంలో వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు
- గ్రూప్-1 అక్రమాలపై శాసనసభలో ధ్వజమెత్తిన చంద్రబాబు
- ఎవాల్యుయేషన్ చేసిన 66 మంది అనర్హులే

**అమరావతి**

వైఎస్సార్సీపీ హయాంలో జరిగిన గ్రూప్-1 పరీక్షల్లో అడుగడునా అక్రమాలే జరిగాయని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. పేపర్లు దిద్దే బాధ్యతలు ప్రైవేట్ ఏజెన్సీలకు ఇచ్చి విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకున్నారని మండిపడ్డారు. తప్పుడు అఫిడవిట్లు సమర్పించి కోర్టునే బురిడీ కొట్టించే యత్నం చేశారని విమర్శించారు. గత హయాంలో జరిగిన గ్రూప్-1 అవకతవకలపై అసెంబ్లీ వేదికగా సీఎం చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు : "గ్రూప్-1పై నివేదికలు చూస్తే భయంకరమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఏపీపీఎస్సీ నియమాలు, నిబంధనలను పూర్తిగా ఉల్లంఘించారు. పేపర్లు దిద్దే బాధ్యతలను ప్రైవేట్ ఏజెన్సీలకు ఇవ్వడమే తప్పు. - మిగతా3లో



## జెన్ జీపై మోదీ సర్కార్
# ఫోకస్

- ప్రతి రోజూ ఓ యూనివర్సిటీకి ఒక కేంద్ర మంత్రి!
- నీట్ పేపర్ లీక్ నిరసనల నేపథ్యంలో కేంద్రం కీలక నిర్ణయం
- వన్ డే వన్ యూనివర్సిటీ పేరుతో సరికొత్త మాస్ అవుట్‌రీచ్ ప్రోగ్రామ్‌కు ప్లాన్
- యువత సవాళ్లు, ఆకాంక్షల్ని నేరుగా తెలుసుకోనున్న మోదీ ప్రభుత్వం



## మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

- విద్యార్థుల భవిష్యత్తును మోదీ సర్కార్ నాశనం చేసింది
- యువత కోసం కొత్త రోడ్‌మ్యాప్ కావాలి
- మల్లికార్జున ఖర్గే తీవ్ర విమర్శలు



## సరుకు రవాణాకు భారీ ఊతం

- రూ.9,450 కోట్లతో 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం
- 4 రైల్వే మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్
- బంగాల్, ఒడిశా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడులో 410 కి.మీ. మేర అదనపు రైల్వే లైన్లు

## త్వరలో 100 పురపాలక సంఘాలకు
# ఎన్నికలు

- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు
- బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్న కూటమి ప్రభుత్వం
- రాష్ట్రంలోని 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల జరగనున్న ఎన్నికలు
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి




**అమరావతి**


స్థానిక ఎన్నికల్లో బీసీలకు 33.33 శాతం రిజర్వేషన్లను యథాతథంగా అమలు చేయాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి నా. సురేశ్ కుమార్ ఉత్వర్వులు జారీ చేశారు. పురపాలక శాఖ కమిషనర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదిక ప్రకారం, రాష్ట్రంలోని మొత్తం 123 పురపాలక సంఘాలకు గానూ 100 చోట్ల త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఇప్పటికే ఐదేళ్ల పదవీకాలం ముగిసిన 87 పురపాలక సంఘాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది నవంబర్ నాటికి పదవీకాలం పూర్తి చేసుకోనున్న మరో 13 చోట్ల ఎన్నికలు జరగనున్నాయి. న్యాయపరమైన సమస్యల కారణంగా 23 పురపాలక సంఘాల్లో ఎన్నికలు సాధ్యపడవని ప్రభుత్వం స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు తీర్పును పరిగణనలోకి తీసుకుని, వెనుకబడిన తరగతులకు మున్సిపల్ ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖరారు - మిగతా3లో



## 2027 ఎన్నికలే
# లక్ష్యం

- బ్రాహ్మణులను ఆకట్టుకునే పనిలో మాయావతి!
- 2027 యూపీ ఎన్నికలే లక్ష్యంగా బీఎస్పీ వ్యూహరచన
- గతంలో అధికారం తెచ్చిపెట్టిన దళిత-బ్రాహ్మణ ఫార్ములాపై ఫోకస్
- కీలక నేత సతీశ్ చంద్ర మిశ్రాకు పెరిగిన బాధ్యతలు
- ఇటీవలి ఎన్నికల్లో ఘోర పరాభవం నుంచి కోలుకునే ప్రయత్నం

## వెలిగొండ నిర్వాసితుల
# త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు



- వెలిగొండ నిర్వాసితులకు పరిహారం చెక్ అందజేసిన సీఎం చంద్రబాబు
- రూ.200కోట్ల మేర నిర్వాసితులకు పరిహారం చెల్లించిన సీఎం
- చంద్రబాబు అన్ని సౌకర్యాలు కల్పించారన్న నిర్వాసితులు

**అమరావతి**

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభానికి కౌంట్‌డౌన్ మొదలైన వేళ నిర్వాసితులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. ఇవాళ మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా నిర్వాసిత కుటుంబాలకు అందజేశారు. ఇప్పటికే ఓటీఎస్ కింద 2557 కుటుంబాలకు - మిగతా3లో



## పీఎం కేర్స్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

- పీఎం కేర్స్ నిధులపై అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు
- ఆ నిధులతో వెయ్యికి పైగా హైటెక్ మోడల్ స్కూళ్లు నిర్మించొచ్చన్న సీజేపీ వ్యవస్థాపకుడు
- కనీస సదుపాయాల కోసం దేశంలోని పిల్లలు ఎదురుచూస్తున్నారు

# జెన్ జీపై మోదీ సర్కార్ ఫోకస్

దేశంలోని యువతీయువకులను (జెన్ జీ)ని ఆకట్టుకునేందుకు, వారికి మరింత దగ్గరయ్యేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త కార్యక్రమాన్ని చేపట్టేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా దేశంలోని యూనివర్సిటీలకు ప్రతి రోజూ ఒక కేంద్ర మంత్రిని పంపించాలని ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం యోచిస్తోంది. 'వన్ డే, వన్ యూనివర్సిటీ' పేరుతో చేపట్టనున్న ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులతో మంత్రులు నేరుగా మాట్లాడి, వారి అభిప్రాయాలు, సమస్యలు, దేశానికి సంబంధించిన వివిధ అంశాలపై వారి ఆలోచనలను తెలుసుకోనున్నారు. ఈ కార్యక్రమం ద్వారా కేవలం ప్రభుత్వ పథకాల్ని ప్రచారం చేయడం మాత్రమే కాకుండా, యువత ఏమనుకుంటున్నారు?, వారి ప్రధాన సమస్యలు ఏంటి? దేశంలో జరుగుతున్న పరిణామాలపై వారి అభిప్రాయాలు ఎలా ఉన్నాయి? వంటి అంశాల్ని తెలుసుకోవడంపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. విద్యార్థులకు ముఖ్యంగా యువత కోసం అమలు చేస్తున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అవకాశాల్ని కూడా కేంద్ర మంత్రులు వివరించనున్నారు. విద్యార్థుల కోపాన్ని తగ్గించి, వారితో నేరుగా మాట్లాడేందుకే ఈ కొత్త ప్రచారాన్ని ప్రారంభించినట్లు తెలుస్తోంది. ప్రధాని మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంపై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఇటీవల దేశవ్యాప్తంగా నీట్ సహా ఇతర ప్రధాన ప్రవేశ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారం కలకలం రేపింది. తర్వాత దిల్లీలోని జంతర్ మంతర్ సహా అనేక ప్రాంతాల్లో విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో కేంద్రం తాజా నిర్ణయం చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా జులై 20న ఆందోళన బాట పట్టిన విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీఛార్జ్ తీవ్ర విమర్శలకు దారితీసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కూడా ప్రతిపక్షాలు ఈ అంశంపై నిరసనలు తెలిపాయి. ఈ వివాదాల నడుమ జులై 25న ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే యువతలో నెలకొన్న అసంతృప్తిని తొలగించి, వారిలో నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం నేరుగా రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది.



ఇంకా ఈ వన్ డే వన్ యూనివర్సిటీ ఇనిషియేటివ్‌ను సమర్థవంతంగా అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఇద్దరు మంత్రులకు కీలక బాధ్యతలు అప్పగించినట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి, కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ- విశ్వవిద్యాలయాలు, ఇతర కేంద్ర మంత్రుల్ని సమన్వయం చేయనున్నారు. కేటాయించిన రోజున ఒక కేంద్ర మంత్రి వర్సిటీకి వెళ్లి విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడతారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (ఖ+జ) లెక్కల ప్రకారం దేశంలో 57 కేంద్ర విశ్వవిద్యాలయాలు, 522 రాష్ట్ర విశ్వవిద్యాలయాలు సహా మొత్తం 1300 కంటే ఎక్కువ యూనివర్సిటీలు ఉన్నాయి.

**యువతరంవైపే ప్రధాని దృష్టి**

ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల యువతపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. నిరసనల సమయంలో విద్యార్థులు, యువతను ఉద్దేశించి సోషల్ మీడియా ద్వారా పలుమార్లు సందేశాలు చేశారు. స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనూ యువత కోసం పలు కొత్త కార్యక్రమాల్ని ప్రకటించారు. ఉచిత ఆన్‌లైన్ కోచింగ్, ఏఐ స్కిల్లింగ్ ప్రోగ్రామ్, క్రీడల్లో యువత ప్రతిభను గుర్తించే కార్యక్రమం వంటి అంశాల్ని ప్రస్తావించారు.

**కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరుపైనా సమీక్ష**

ఇదే సమయంలో యువత, జెన్‌జీకి మరింత చేరువయ్యేందుకు సోషల్ మీడియాను విస్తృతంగా ఉపయోగించుకోవాలని కేంద్ర మంత్రులకు ప్రభుత్వం సూచించింది. ప్రధాని అధ్యక్షతన జరిగిన కేబినెట్ భేటీలో కేంద్ర మంత్రుల సోషల్ మీడియా పనితీరు, వారి పోస్టులకు వస్తున్న రీచ్‌పై చర్చ జరిగినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ రీచ్ ర్యాంకింగ్స్‌లో మోదీ అగ్రస్థానంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మంత్రుల సోషల్ మీడియా పోస్టులు ఎంత మందికి చేరుతున్నాయి, వాటి ద్వారా ఏ మేర ప్రజల్ని చేరుకోగలుగుతున్నారనే అంశాలపై సమావేశంలో సమీక్ష జరిగినట్లు సమాచారం. యువతకు ప్రభుత్వ సందేశాలు మరింత విస్తృతంగా చేరేలా మంత్రులు తమ సోషల్ మీడియా రీచ్ పెంచుకోవాలని కూడా సూచించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

# మోదీ ప్రభుత్వం యువత భవిష్యత్తును దెబ్బతీస్తోంది

విద్యార్థులు, యువత భవిష్యత్తును గత 12 ఏళ్లుగా మోదీ ప్రభుత్వం తీవ్రంగా దెబ్బతీస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే బుధవారం తీవ్ర విమర్శలు చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించేలా కాంగ్రెస్ సమగ్ర 'ఎడ్యుకేషన్ టు ఎంప్లాయ్‌మెంట్ రోడ్‌మ్యాప్' రూపొందించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. దిల్లీలని ఇందిరా భవన్?లో బుధవారం జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం ప్రారంభ ప్రసంగం సందర్భంగా ఖర్గే ఈ వ్యాఖ్యలు చేశారు. 'దేశంలో కొత్త పాఠశాలలు ప్రారంభం కావాల్సి ఉంది. అవి కాకపోగా, ఇటీవల సంవత్సరాల్లో సుమారు 94వేల పాఠశాలలు మూతపడ్డాయి. యువత భవిష్యత్తును మెరుగుపరిచే విధానాల స్థానంలో విద్యా రంగంలో ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రైవేటీకరణ పెరగడంతో ఉన్నత విద్య ఖరీదైనదిగా మారుతోంది. సాధారణ కుటుంబాలకు ఉన్నత విద్య అందుబాటులో లేకుండా పోతోంది. విద్యా సంస్థల్లో ఆర్ఎస్ఎస్‌కు చెందిన వ్యక్తుల ప్రాబల్యం పెరుగుతోంది. విద్యా వ్యవస్థను బలోపేతం చేయాల్సిన సమయంలో సంస్థల స్వరూపాన్ని మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి' అని ఖర్గే అన్నారు.

**'పేపర్ లీకులు నియామకాల జాప్యం'**

చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసం ప్రయత్నించే యువతకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని ఖర్గే పేర్కొన్నారు. పేపర్ లీకులు, నియామక పరీక్షల్లో అక్రమాలు, ఉద్యోగ నియామకాల్లో జాప్యం కారణంగా నిరుద్యోగులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా పేద, అణగారిన వర్గాలకు చెందిన విద్యార్థులే ఈ పరిణామాలతో ఎక్కువగా నష్టపోతున్నారని వ్యాఖ్యానించారు. యువతలో దేశవ్యాప్తంగా కనిపిస్తున్న ఆగ్రహం ఒక్కరోజులో పుట్టింది కాదని అన్నారు. వారి సమస్యలను వినడానికి ప్రభుత్వం ఎప్పుడూ తగినంత సమయం కేటాయించలేదని, సమస్యలను పరిష్కరించడానికి బదులుగా తాత్కాలిక చర్యలతో వాటిని పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. దీంతో యువత రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. యువత సమస్యలను కాంగ్రెస్ తన రాజకీయ అజెండాలో చేర్చిందని ఖర్గే తెలిపారు. రాహుల్ గాంధీ ఛత్రోన్ కీ గూంజ్ కార్యక్రమం ద్వారా విద్యార్థుల సమస్యలను జాతీయ స్థాయికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. పార్లమెంట్‌లోనూ విద్య, పరీక్షలకు సంబంధించిన సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని కాంగ్రెస్ కోరిందన్నారు.



**రామాలయ విరాళాల అంశంపైనా ప్రశ్నలు**

ఈ సందర్భంగా అయోధ్య రామాలయానికి సంబంధించిన విరాళాలపై వచ్చిన ఆరోపణలను కూడా ఖర్గే ప్రస్తావించారు. విరాళాల నిధుల దుర్వినియోగం లేదా చోరీ జరిగిందన్న ఆరోపణలపై ప్రధాని నరేంద్ర మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఈ అంశంపై ప్రధాని ప్రజలకు సమాధానం చెప్పాలని, క్షమాపణ చెప్పాలని ఖర్గే డిమాండ్ చేశారు. ఆర్థిక అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

**చైనా చొరబాట్లపైనా ప్రశ్నలు**

భారత్-చైనా సరిహద్దుల్లో చైనా చొరబాట్లకు సంబంధించిన వార్తలపైనా ఖర్గే స్పందించారు. జాతీయ భద్రతను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించకూడదని అన్నారు. అదే సమయంలో సరిహద్దుల పరిస్థితిపై ప్రజలు ప్రశ్నలు అడగకుండా జాతీయ భద్రత పేరుతో అడ్డుకోవడం కూడా సరికాదని వ్యాఖ్యానించారు. భారత సాయుధ దళాలపై తమకు అత్యంత గౌరవం ఉందని, అయితే సరిహద్దుల్లో వాస్తవ పరిస్థితి, కేంద్ర ప్రభుత్వ వైఖరిపై ప్రజలకు పారదర్శకంగా సమాధానాలు ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని అన్నారు.

**రాజీవ్ గాంధీని గుర్తుచేసుకున్న ఖర్గే**


స్వాతంత్ర్యం వచ్చి 80 ఏళ్లు పూర్తవుతున్నప్పటికీ కీలక రంగాల్లో పరిస్థితులు మెరుగుపడటానికి బదులుగా దిగజారు తున్నాయని ఖర్గే వ్యాఖ్యానించారు. మతపరమైన ఉద్రిక్తతలు, రేవడి సంస్కృతి రాజకీయాల మధ్య విద్య, ఉపాధి అంశాలు తీవ్రంగా నిర్లక్ష్యానికి గురవుతున్నాయని ఆరోపించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకున్న ఖర్గే, భారీ మెజారిటీతో ప్రభుత్వం నడిపినప్పటికీ రాజీవ్ గాంధీ యువతను తన విధానాల కేంద్రంగా ఉంచారని అన్నారు. స్వాతంత్ర్యం తర్వాత అందుబాటు ధరల్లో విద్యను విస్తరించేందుకు కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలే పేదలు, అణగారిన వర్గాలకు సామాజిక, ఆర్థిక పురోగతికి మార్గం చూపాయని పేర్కొన్నారు.

**కీలక నేతల హాజరు**

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి ఖర్గే అధ్యక్షత వహించారు. మాజీ కాంగ్రెస్ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు ప్రియాంక గాంధీ, జైరాం రమేశ్, కేసీ వేణుగోపాల్ సహా పలువురు సీనియర్ నేతలు హాజరయ్యారు. సీనియర్ నాయకులు అంబికా సోని, ముకుల్ వాస్నిక్, పీ చిదంబరం తదితర అగ్రనేతలు కూడా పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలైన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్, హిమాచల్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తదితరులు సమావేశానికి హాజరయ్యారు.

# ఏకంగా 600 మంది ఉద్యోగుల తొలగింపు

**న్యూఢిల్లీ :** ఔం డైరెక్టర్ జనరల్ అభిషేక్ సింగ్ సంస్థలో తీసుకున్న చర్యలను మంత్రిత్వశాఖకు వివరించారు. పరీక్షల బృందాన్ని పూర్తిగా పునర్వ్యవస్థీకరించే చర్యల్లో భాగంగా సుమారు 600 మంది నిపుణులను తొలగించి, వారి స్థానంలో కొత్త నిపుణులను నియమించనున్నారు. ప్రశ్నపత్రాల్లో పొరపాట్లు, లోపాలు లేకుండా చూసేందుకు నాలుగు అంచెల తనిఖీ వ్యవస్థను తీసుకురానున్నారు. ఔంలో వచ్చే రెండు నుంచి మూడు వారాల్లో మరో 20-25 మంది అధికారులను నియమించనున్నట్లు విద్యాశాఖ తెలిపింది. భవిష్యత్‌లో మరిన్ని నియామకాలు చేపట్టే ప్రణాళికపైనా సమీక్ష నిర్వహించినట్లు పేర్కొంది. అంతేకాకుండా ఔం కార్యాలయాలను కొత్త భవనాలకు యుద్ధప్రాతిపదికన తరలించనున్నారు. కార్యాలయాల భద్రతను మరింత కట్టుదిట్టం చేసేందుకు సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ సిబ్బందిని మోహరించనున్నారు. ప్రశ్నపత్రం లీకేజీ వివాదం, ఇటీవల యూజీసీ నెట్ పరీక్షల్లో తలెత్తిన సమస్యలపై కేంద్ర విద్యాశాఖ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా విద్యార్థుల ఆందోళనలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తడంతో ఔంలో సంస్కరణలకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రల్హాద్ జోషి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో పరీక్షల నిర్వహణకు అవసరమైన భద్రతా, మౌలిక సదుపాయాలను పటిష్టం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల నెట్ జూన్ 2026 పరీక్షలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇంగ్లిష్, కామర్స్, సోషియాలజీ సబ్జెక్టుల్లో పరీక్షలను మళ్లీ నిర్వహించాలని ఔం ప్రకటించింది. ఈ మూడు ప్రశ్నపత్రాల్లో వాస్తవపరమైన తప్పులు, టైపింగ్ పొరపాట్లు, అనువాద లోపాలు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు నిపుణుల కమిటీ గుర్తించింది. దీంతో అవి న్యాయమైన, లోపరహిత పరీక్ష ప్రమాణాలకు అనుగుణంగా లేవని కమిటీ తేల్చింది. పరీక్షల నిర్వహణలో లోపాలపై చర్యల్లో భాగంగా జూలైలోనే 47 మంది ఔం అధికారుల సేవలను ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా మరో 600 మంది నిపుణులను తొలగించి కొత్త వారిని నియమించే ప్రక్రియ చేపట్టడంతో భారీ స్థాయిలో ప్రక్షాళన జరుగుతోంది. పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం మరో కీలక చర్య చేపట్టింది. పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (అన్యాయ పద్ధతుల నివారణ) సవరణ బిల్లు-2026ను పార్లమెంట్ ఇటీవల ముగిసిన వర్షాకాల సమావేశాల్లో ఆమోదించింది. పేపర్ లీకేజీ కేసుల్లో కఠిన శిక్షలు, ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు, నిర్ణీత గడువులో విచారణ వంటి నిబంధనలను ఈ బిల్లు ప్రతిపాదిస్తోంది. పేపర్ లీకేజీ, నిరసన చేస్తున్న విద్యార్థులపై జూలై 20న జరిగిన పోలీసు చర్యల నేపథ్యంలో పార్లమెంట్ ఉభయ సభల్లో తీవ్ర గందరగోళం నెలకొన్న తర్వాత ఈ బిల్లుకు ఆమోదం లభించింది. మొత్తంగా ఔంలో చేపడుతున్న తాజా సంస్కరణలు పరీక్షల నిర్వహణలో పారదర్శకత, భద్రత, ప్రశ్నపత్రాల నాణ్యతను పెంచడమే లక్ష్యంగా సాగుతున్నాయి.



## సరుకు రవాణాకు భారీ ఊతం

దేశంలో రవాణా మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ, రైల్వే మంత్రిత్వ శాఖకు చెందిన నాలుగు మల్టీట్రాకింగ్ ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది. వీటి మొత్తం అంచనా వ్యయం సుమారు రూ.9,450 కోట్లు. అదే సమయంలో బిహార్‌లోని ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మార్గాన్ని నాలుగు లేన్ల జాతీయ రహదారిగా అభివృద్ధి చేసేందుకు మరో రూ.3,590.73 కోట్ల ప్రాజెక్టుకు కేబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొత్తగా ఆమోదించిన నాలుగు రైల్వే ప్రాజెక్టులతో భారత రైల్వే నెట్‌వర్క్‌లో సుమారు 410 కిలోమీటర్ల మేర అదనపు లైన్లు అందుబాటులోకి రానున్నాయి. 2030-31 నాటికి ఈ పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. బంగాల్? ఖరగ్‌పూర్ నుంచి ఒడిశాలోని భద్రక్ (రాణీతాల్) వరకు 173 కి.మీ. మేర నాలుగో లైన్ నిర్మించనున్నారు. భద్రక్-హరిదాస్‌పూర్ మధ్య 75 కి.మీ. మేర మరో నాలుగో లైన్ ఏర్పాటు చేయనున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని గుమ్మిడిపూండి నుంచి తమిళనాడులోని గూడూరు వరకు 90 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లను నిర్మించనున్నారు. ఒడిశాలోని కటక్ నుంచి పరదీప్ (బడబంధ) వరకు 72 కి.మీ. మేర మూడో, నాలుగో లైన్లు ఏర్పాటు చేయనున్నారు. ఈ నాలుగు ప్రాజెక్టులు బంగాల్, ఒడిశా, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లోని ఎనిమిది జిల్లాలను కవర్ చేయనున్నాయి. సుమారు 6,448 గ్రామాలకు రైలు కనెక్టివిటీ మెరుగుపడనుంది. దాదాపు 60 లక్షల మంది ప్రజలు ఈ ప్రాజెక్టుల ద్వారా ప్రయోజనం పొందుతారని కేంద్రం తెలిపింది.

**సరుకు రవాణాకు భారీ ఊతం**

ఈ మార్గాలు బొగ్గు, ఇనుప ఖనిజం, సిమెంట్, ఇనుము-ఉక్కు, కంటైనర్లు, ఆటోమొబైల్స్, ఆహార ధాన్యాల వంటి సరుకుల రవాణాకు కీలకమైనవి. లైన్ల విస్తరణతో ఏటా 76 మిలియన్ టన్నుల అదనపు సరుకు రవాణా సామర్థ్యం అందుబాటులోకి వస్తుందని కేంద్రం అంచనా వేసింది. పర్యాటక రంగానికీ ఈ ప్రాజెక్టులు ఉపయోగపడనున్నాయి. కుల్డిహా వన్యప్రాణి అభయారణ్యం, భితర్‌కణిక జాతీయ ఉద్యానవనం, చంద్రభాగ, తలసరి-ఉదయ్‌పూర్, చాందీపూర్ బీచ్, పులికాట్ సరస్సు, నెలపట్టు పక్షుల అభయారణ్యం, లలిత్‌గిరి తదితర పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు కనెక్టివిటీ మెరుగుపడనుంది. రైల్వే పర్యావరణహిత, ఇంధన సామర్థ్యం కలిగిన రవాణా మార్గమని కేంద్రం తెలిపింది. ఈ ప్రాజెక్టుల వల్ల ఏటా సుమారు 13 కోట్ల లీటర్ల చమురు దిగుమతి తగ్గడంతో పాటు 65 కోట్ల కిలోల కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గుతాయని అంచనా వేసింది. ఇది సుమారు 2.60 కోట్ల చెట్లను నాటినంత ప్రయోజనంతో సమానమని పేర్కొంది.

**బిహార్‌లో ఎన్‌హెచ్-22 విస్తరణ**

ఇక బిహార్‌లో ముజఫర్‌పూర్-సీతామఢి-సోన్బర్సా మధ్య 82.578 కి.మీ. పొడవైన ఎన్‌హెచ్-22ను నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయడానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్?ఏఎం)లో చేపట్టే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.3,590.73 కోట్లు. ఈ రహదారి భారత్-నేపాల్ సరిహద్దులోని సోన్బర్సాను ముజఫర్‌పూర్‌లోని ఎన్‌హెచ్-27తో అనుసంధానించనుంది. దీంతో ముజఫర్‌పూర్, బరౌనీ వంటి ఆర్థిక కేంద్రాలకు రవాణా సౌకర్యం మెరుగుపడటంతో పాటు గంగానది పరివాహక ప్రాంతంలోని సరుకు రవాణా కేంద్రాలకు అనుసంధానం బలోపేతం కానుంది. నేపాల్ సరిహద్దులోని భిఠామోర్ ల్యాండ్ పోర్టు ద్వారా ప్రయాణికులు, సరుకుల రాకపోకలకు కూడా ఈ రహదారి కీలకం కానుంది.

**ఏడు వంతెనలు- మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు**

ప్రాజెక్టులో ఏడు ప్రధాన వంతెనలు, మూడు రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, రెండు ఫ్లైఓవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు ఉన్నాయి. వీటిలో బాగ్మతీ నదిపై 340 మీటర్ల పొడవైన ప్రధాన వంతెన కూడా ఉంది. ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు 1,170 మీటర్లు, 270 మీటర్ల పొడవైన రెండు ఫ్లైఓవర్లు నిర్మించనున్నారు. ముజఫర్‌పూర్, ముక్సుద్‌పూర్, రున్నీ సైద్‌పూర్, తుమ్మా, డుమ్రా, భూతాహీ, సోన్బర్సా వంటి జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించి.. సురక్షితమైన, వేగవంతమైన రాకపోకలకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని కేంద్రం తెలిపింది.

## పీఎం కేర్స్ నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేయాలి

పీఎం కేర్స్ నిధులపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే కీలక వ్యాఖ్యలు చేశారు. దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలల మౌలిక వసతులు మెరుగుపర్చేందుకు పీఎం కేర్స్ ఫండ్‌లోని నిధులను వినియోగించాలని డిమాండ్ చేశారు. తాను నిజంగానే కేర్ తీసుకుంటున్నానని ప్రధాని నరేంద్ర మోదీ నిరూపించుకోవాలని అన్నారు. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు వంటి కనీస సదుపాయాల కోసం దేశంలోని పిల్లలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నప్పుడు వాటిని పాఠశాలల అభివృద్ధికి ఎందుకు ఉపయోగించకూడదని ప్రశ్నించారు. ఈ మేరకు ఎక్స్?లో పోస్ట్ చేశారు. 'తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, 2025 మార్చి 31 నాటికి పీఎం కేర్స్ ఫండ్? మొత్తం నిల్వ రూ.8,452 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఈ మొత్తం రూ.7,173 కోట్లుగా ఉంది. పాఠశాలలకు వెళ్లేందుకు సరైన రోడ్లు, తరగతి గదుల్లో బెంచీలు, తాగునీరు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త పాఠశాలల కోసం ఈ నిధులను ఎందుకు ఉపయోగించడం లేదు? ఒక మంచి మౌలిక వసతులతో కూడిన మోడల్ స్కూల్ నిర్మాణానికి సుమారు రూ.8 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తే, రూ.8,500 కోట్లతో వెయ్యికి పైగా హైటెక్ పాఠశాలలను నిర్మించే అవకాశం ఉంది. కానీ అలా జరగడం లేదు. ఇటువంటి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు' అని దీప్కే ప్రశ్నించారు.

**గ్రామీణ పాఠశాలల్లో దుస్థితి**

మహారాష్ట్రలోని గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల తాను సందర్శించిన పాఠశాలల్లో పరిస్థితులు చాలా దారుణంగా ఉన్నాయని దీప్కే ఆరోపించారు. కనీస సౌకర్యాలు ఎందుకు లేవని అధికారులను ప్రశ్నించగా, నిధుల కొరత ఉందని సమాధానం ఇచ్చారని తెలిపారు. ఒకవైపు పాఠశాలల్లో సౌకర్యాలు కల్పించేందుకు నిధులు లేవని అధికారులు చెబుతుండగా, మరోవైపు పీఎం కేర్స్ ఫండ్‌లో వేల కోట్ల రూపాయలు ఉన్నాయని ఆయన అన్నారు. ఆ నిధులను పిల్లల విద్య కోసం ఉపయోగించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. మరో పోస్ట్?లో గ్రామీణ పాఠశాలల దుస్థితిని చూపించేలా మురికిగా ఉన్న మరుగుదొడ్డి, శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం ఫొటోలను కూడా దీప్కే సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. పీఎం కేర్స్ నిధులను మంచి పనికి ఉపయోగించవచ్చు అంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పీఎం కేర్స్ నిధులను ప్రజల కోసం, ముఖ్యంగా పేద పిల్లల విద్య, పాఠశాలల అభివృద్ధి కోసం ఉపయోగించాలని దీప్కే ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. పిల్లలు మంచి పాఠశాలలు, మెరుగైన సదుపాయాల కోసం ఎదురుచూస్తున్నారని, అందుబాటులో ఉన్న నిధులను వారి భవిష్యత్తు కోసం వినియోగించాలని అన్నారు. ప్రధాని నిజంగా పిల్లల గురించి పట్టించుకుంటున్నారని చూపించాలని వ్యాఖ్యానించారు. తాజా ఆడిట్ నివేదిక ప్రకారం, పీఎం కేర్స్ ఫండ్‌లోని మొత్తం రూ.8,452 కోట్లలో సుమారు రూ.7,846 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్నాయని, మరో రూ.605 కోట్లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాల్లో ఉన్నాయని వెల్లడైంది.

## 2027 ఎన్నికలే లక్ష్యం..

ఉత్తరప్రదేశ్ రాజకీయాల్లో పూర్వ వైభవాన్ని సంతరించుకునే దిశగా బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధినేత్రి మాయావతి తన వ్యూహాలకు పదును పెట్టారు. 2027 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా, గతంలో 2007లో తనకు చారిత్రక విజయాన్ని అందించిన "దళిత-బ్రాహ్మణ" సామాజిక సమీకరణాన్ని ఆమె తిరిగి తెరపైకి తెస్తున్నారు. వరుస ఓటములతో కుదేలైన పార్టీని గట్టెక్కించేందుకు ఈ పాత ఫార్ములానే సరైన మార్గమని ఆమె విశ్వసిస్తున్నారు.

ఈ వ్యూహంలో భాగంగా, పార్టీలో కీలక నేత, తన అత్యంత సన్నిహితుడైన సతీశ్ చంద్ర మిశ్రాకు మాయావతి అదనపు బాధ్యతలు అప్పగించారు. బీఎస్పీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయన, ఇకపై పార్టీకి సంబంధించిన లీగల్, మీడియా విభాగాలకు కూడా నేతృత్వం వహించనున్నారు. అలాగే, కేంద్రం ఎన్నికల సంఘానికి సంబంధించిన వ్యవహారాలను సైతం ఆయనే పర్యవేక్షిస్తారని మాయావతి ప్రకటించారు. రాబోయే ఎన్నికల్లో మిశ్రా పాత్ర అత్యంత కీలకం కానుందని ఆమె స్పష్టం చేశారు.

# వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్

-మొదటిపేజీ తరువాయి

ఏపీపీఎస్సీ ఛైర్మన్ ఆమోదం లేకుండా ఏ పనీ చేయకూడదు. పేపర్లు దిద్దడంలో ప్రతి దశలోనూ నిబంధనలు ఉల్లంఘించారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లు చేయాల్సిన పనిని కార్మికులతో చేయించారు. ఈ మెయిల్, గూగుల్ డ్రైవ్, వాట్సప్‌లో వివరాలు షేర్ చేసుకున్నారు. ఇష్టానుసారంగా పేపర్లు దిద్దే అధికారం వీరికి ఎవరిచ్చారు మార్కులు తగ్గించడం, పెంచడం ఇష్టం వచ్చినట్లు చేశారు. సీఎం ఇంటెలిజెన్స్ ఆఫీసర్‌కు సెక్రటరీ పోస్టు ఇచ్చారు. ఏపీపీఎస్సీ ఛైర్మన్‌ను కట్టడి చేశారు. అభ్యర్థుల ప్రతిభ చూసి ఉద్యోగాలు ఇవ్వలేదు. వ్యవస్థలపై నమ్మకం కోల్పోయేలా ప్రవర్తించారు" అని సీఎం చంద్రబాబు అసెంబ్లీ వేదికగా ధ్వజమెత్తారు. "తొలుత హైదరాబాద్‌లో, రెండోసారి హాయ్‌లాండ్‌లో పేపర్లు దిద్దించారు. హైదరాబాద్‌లో ఎవాల్యుయేషన్ చేసిన వారిలో 25 మంది అనర్హులు. హాయ్‌లాండ్‌లో ఎవాల్యుయేషన్ చేసిన 66 మందీ అనర్హులే. మాన్యువల్ ఎవాల్యుయేషన్ జరగాలి, డిజిటల్ మూల్యాంకనం వద్దని హైకోర్టు చెప్పింది. భవన నిర్మాణ కార్మికులు, డ్రైవర్లు, ప్లంబర్లతో పేపర్లు దిద్దించారు. ఫ్రీలాన్సర్ మహంకాళి రఘురామ్‌ను నియమించారు. 166 మందిలో 50 మంది డిగ్రీ లెక్చరర్లను వినియోగించారు. గ్రూప్-1 జవాబు పత్రాల్లో ఫ్లూయిడ్‌తో తప్పులు దిద్దకూడదు. కానీ 55 చోట్ల తప్పులు సరిచేశారు. 49వేల డూప్లికేట్ ఓఎంఆర్ స్లిప్పులు ప్రింట్ చేశారు. గ్రూప్-1 పరీక్షలు రాసిన లెక్చరర్‌ను కూడా పేపర్లు దిద్దేందుకు పిలిచారు. కోర్టులను పక్కదారి పట్టించేందుకు అధికారులతో తప్పుడు అఫిడవిట్లు వేయించారు. ఖర్చుల కోసం రూ.1.14 కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో సిట్ ఏర్పాటైంది.

వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి, పైరవీలకు దూరంగా ఉండాలి. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. చేసింది సరైనదే అని చెప్పే దమ్ము, ధైర్యం వైఎస్సార్సీపీ నేతలకు ఉందా? ఇలాంటి అక్రమాలకు పాల్పడితే ప్రతిభావంతులు నష్టపోతారు. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ" అని సీఎం చంద్రబాబు అన్నారు. "వైఎస్సార్సీపీ హయాంలో గ్రూప్-1 నిర్వహణ



అతిపెద్ద స్కామ్. ఇలాంటి తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు ఉండాలి. తప్పు చేసిన వారిని శిక్షించే బాధ్యత మనందరిదీ. ఇలాంటి పనులు చేస్తే ప్రతిభావంతులైన పిల్లలు నష్టపోతారు. వ్యవస్థలు సరిగా పనిచేస్తే ఎవరూ తప్పు చేయలేరు. ఎవరైనా ప్రతిభకు పట్టం కట్టాలి, పైరవీలకు దూరంగా ఉండాలి. ఇంతకంటే నేరాలు, ఘోరాలు వేరే ఉంటాయా. ఇలాంటి తప్పులు ఎందుకు చేశారో సమాధానం చెప్పాలి. మీరు చేసింది సరైందే అని చెప్పే దమ్ము, ధైర్యం ఉందా?

**మామూలుగా అరెస్ట్ చేస్తే సరిపోదు**

వ్యక్తుల కంటే వ్యవస్థలు ముఖ్యమన్న చంద్రబాబు ఈ కుంభకోణంలో భాగస్వాములైన వారిని మామూలుగా అరెస్ట్ చేస్తే సరిపోదనీ అభిప్రాయపడ్డారు. 'భవిష్యత్తులో తప్పులు చేయాలంటే భయపడేలా శిక్షలు విధిస్తాం. నాటి ప్రభుత్వంలో ఇంటెలిజెన్స్ చీఫ్?గా వ్యవహరించిన వ్యక్తే ఇంతటి దారుణాలకు పాల్పడ్డారు. వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేస్తాం. తిరిగి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాం. యువత ప్రతిభను గుర్తించి, వారి భవిష్యత్తుకు అండగా ఉంటాం' అని చంద్రబాబు అన్నారు.

**రాష్ట్రానికి చెందిన విద్యార్థులే ఎక్కువ**

టెక్నాలజీలో జాతీయ స్థాయిలోనే ఏపీ పిల్లలు ముందంజలో ఉంటారనీ, చీూజుూ పరీక్షల కోసం మన రాష్ట్రానికి చెందిన విద్యార్థులే ఎక్కువ మంది ఉన్నారని సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓటేయడంతో ఆగకుండా ప్రజా చైతన్యంతో వ్యవహరిస్తున్నారనీ, అధికారం ఇస్తే దోచుకుంటాం, పెత్తనం చేస్తామని అధికారం లేకుంటే రోడ్ల మీద పడి అరాచకం చేస్తామనడం ప్రజాస్వామ్యం కాదన్నారు. అడ్డగోలుగా వ్యవహరించే ఇలాంటి వ్యక్తులను ప్రజా చైతన్యంతో రాజకీయాలకు దూరంగా పెట్టగలం అన్నారు. 2024 ఎన్నికల్లో ఆ ప్రజా చైతన్యాన్నే ఓటర్లు చూపించారు. రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని నేను, పవన్ కల్యాణ్ చెబితే ప్రజలు నమ్మి ఓట్లేశారు, అద్భుతమైన తీర్పు ఇచ్చారని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఎన్నికల్లో డబ్బులు ఖర్చు పెట్టే సంస్కృతి పోవాలన్నారు. అప్పుడే ఇలాంటి దరిద్రాలన్నీ పోతాయన్నారు. అప్పుడే ఇలాంటి వారు రాజకీయాల్లోకి దూరంగా ఉంటారనీ చంద్రబాబు అభిప్రాయపడ్డారు.

**స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆవేదన లి**

గ్రూప్-1 పరీక్షల్లో జరిగిన అవకతవకలపై శాసనసభలో చర్చ సందర్భంగా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సమాధానం ఇవ్వడానికి ముందు ఆయన మాట్లాడుతూ, తాను స్పీకర్ స్థానంలో ఉండి కాకుండా ఈ సభలోని ఒక శాసనసభ్యుడిగా తన మనసులోని మాటను చెబుతున్నానని పేర్కొన్నారు. గతంలో గ్రూప్-1 అక్రమాలపై వార్తాపత్రికలు, టీవీల్లో కథనాలు చూసినప్పటికీ వాటి తీవ్రతను ఇంతగా ఊహించలేదని, అయితే ఇప్పుడు సభలో ప్రదర్శించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చూశాక అభ్యర్థులకు ఎంతటి ఘోరమైన అన్యాయం జరిగిందో కళ్లకు కట్టినట్లయిందని స్పష్టం చేశారు. ఇంతటి తీవ్రమైన వ్యవహారంలో ప్రభుత్వం ఏమాత్రం మెతక వైఖరి ప్రదర్శించకూడదని స్పీకర్ తేల్చి చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సాధారణంగా ఎవరినీ నొప్పించని స్వభావం కలవారే అయినప్పటికీ, నిరుద్యోగుల జీవితాలతో ముడిపడిన ఈ వ్యవహారంలో మాత్రం నిందితులపై ఉక్కుపాదం మోపాల్సిందేనని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలకు పాల్పడాలంటేనే ఎవరైనా భయపడేలా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఇకపై ఇలాంటి తప్పుడు పనులు ఎక్కడా పునరావృతం కాకుండా చూడాలని, అందుకు ఇక్కడి నుంచే పటిష్టమైన చర్యలకు శ్రీకారం చుట్టాలని ముఖ్యమంత్రిని, సభను కోరారు.

# త్వరలో 100 పురపాలక సంఘాలకు ఎన్నికలు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఓటర్ల జాబితా తయారీ, వార్డుల విభజన, రిజర్వేషన్ల ఖరారు వంటి చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

**త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం**

రాష్ట్రంలో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికల కోలాహలం మొదలుకానుంది. ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. అందులో భాగంగా నేడు రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించింది. స్థానిక సంస్థల ఎన్నికల ఏర్పాట్లపై కలెక్టర్లతో ముందస్తు సమీక్ష చేశామని, ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఒక్కో ప్రక్రియ పూర్తి చేసుకుంటూ వెళ్తున్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే సంబంధిత శాఖల కమిషనర్లకు సమాచారం ఇచ్చామని ప్రోటోకాల్ ప్రకారం ఏయే కార్యక్రమాలు చేయాలి అన్న దానిపై సమీక్షించినట్లు పునేఠా తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిలో చేయాల్సిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష జరిపినట్లు పునేఠా వివరించారు. ఓటర్ల జాబితా ప్రదర్శన ఆగస్టు 17తో పూర్తైందని చెప్పారు.

**పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు గ్రీన్‌సిగ్నల్**

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు అధికార యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే 87 పుర, నగరపాలికలతో పాటు 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉన్నట్లు రాష్ట్ర పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు స్పష్టం చేశాయి. ఎన్నికల సన్నద్ధతపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా నిర్వహించిన ఉన్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు రెండు శాఖలు వేర్వేరుగా నివేదికలు సమర్పించాయి. డివిజన్లు, వార్డుల పునర్విభజనపై కోర్టుల్లో ఉన్న కేసులు పరిష్కారమైతే 87 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీల్లో ఎన్నికల ప్రక్రియను వెంటనే ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ స్పష్టం చేసింది. కోర్టు తీర్పు




ప్రభుత్వానికి అనుకూలంగా వచ్చిన 20 రోజుల్లోనే వంద చోట్లా పునర్విభజన ప్రక్రియను పూర్తి చేస్తామని వెల్లడించింది.

**మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం పూర్తి**

2021లో ఎన్నికలు జరిగిన 100 పుర, నగరపాలక సంస్థల్లో 87 చోట్ల ఈ ఏడాది మార్చితోనే పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. మరో 13 చోట్ల నవంబరు 22తో ముగియనుంది. సమీప గ్రామ పంచాయతీలను విలీనం చేసే చట్టం-5పై దాఖలైన పిటిషన్లతో గతంలో 23 చోట్ల ఎన్నికలు నిలిచిపోయాయి. అయితే వీటిలో మంగళగిరి-తాడేపల్లి, శ్రీకాళహస్తి, కావలి, అల్లూరుకి సంబంధించిన కేసులు ఇటీవల ఉపసంహరించుకున్నట్లు సమాచారం. మిగిలిన కేసుల పరిష్కారంపైనా వేగంగా చర్యలు తీసుకుంటున్నట్లు పురపాలక శాఖ ఎస్ఈసీకి నివేదించింది.

**పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్**

రాష్ట్రవ్యాప్తంగా 13,341 గ్రామ పంచాయతీల్లో ఎన్నికల నిర్వహణకు పంచాయతీరాజ్ శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. కోర్టు కేసులు, ఇతర కారణాలతో దాదాపు వంద పంచాయతీల్లో మినహా, మిగిలిన చోట్ల ఎన్నికలు నిర్వహించవచ్చని ఎస్ఈసీకి స్పష్టం చేసింది. దీనికోసం ఇప్పటికే వార్డుల వారీగా ఓటర్ల తుది జాబితాలు ప్రచురించి, ఏర్పాట్లు ముమ్మరం చేసినట్లు నివేదికలో వివరించింది. 2021 ఎన్నికల సమయంలో విలీనం వివాదాలతో హైకోర్టులో కేసులు దాఖలు కావడంతో అప్పట్లో 354 పంచాయతీల్లో ఎన్నికలు ఆగిపోయాయి. వాటిలో కొన్ని కేసులు ఇప్పటికే పరిష్కారం కాగా, మరికొన్ని ఇంకా పెండింగ్‌లో ఉన్నట్లు పంచాయతీరాజ్ శాఖ తెలిపింది. ఏదిఏమైనా న్యాయపరమైన చిక్కులు తొలగితే రాష్ట్రంలో అతి త్వరలోనే స్థానిక సమరం ఖాయంగా కనిపిస్తోంది.

**వెంటనే షెడ్యూల్ విడుదల**

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు ముమ్మరం చేసింది. ప్రభుత్వ శాఖల సన్నద్ధతపై నివేదికలు అందడంతో, కోర్టు కేసుల అడ్డంకులు తొలగిన వెంటనే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం కనిపిస్తోంది.

# బలపడుతున్న అనుమానాలు... పవన్ గైర్హాజరుపై సోషల్ మీడియా

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో కొన్ని కీలక ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరుకాకపోవడం, టీడీపీ-జనసేన సోషల్ మీడియా గ్రూపుల మధ్య నడుస్తున్న సైలెంట్ వార్ రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. పవన్ కల్యాణ్ కేబినెట్ సమావేశం, సీడ్ యాక్సెస్ రోడ్ ప్రారంభోత్సవం , రాజ్‌భవన్‌లో గవర్నర్ ఏర్పాటు చేసిన ఎట్ హోమ్ కార్యక్రమానికి దూరంగా ఉండటాన్ని వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హైలైట్ చేసే ప్రయత్నం చేసింది. కూటమిలో విభేదాలు మొదలయ్యాయని ప్రచారం ప్రారంభించింది అగ్రనాయకులు చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ పరస్పర గౌరవంతోనే ముందుకు సాగుతున్నప్పటికీ.. సోషల్ మీడియా వేదికగా కిందిస్థాయి కార్యకర్తలు, సానుభూతి పరుల మధ్య వివాదాలు ముదురుతుండటం ప్రతికూల అంశంగా మారింది. స్థానిక నియోజకవర్గాల్లో ప్రాధాన్యత, పనుల కేటాయింపులు, పోస్టింగ్స్ విషయంలో టీడీపీ-జనసేన శ్రేణుల మధ్య అసంతృప్తులు కనిపిస్తున్నాయి. ఒకరినొకరు టార్గెట్ చేసుకుంటూ పోస్టులు పెట్టుకోవడం ప్రత్యర్థులకు మంచి ఆయుధంగా మారుతోంది. అయితే ఈ సోషల్ మీడియా రచ్చను అరికట్టేందుకు ఇప్పటికే ఇరు పార్టీల అధినాయకత్వాలు హెచ్చరికలు జారీ చేస్తూ పరిస్థితిని కంట్రోల్ చేసే ప్రయత్నం చేస్తున్నాయి.వైసీపీ శ్రేణులు కూటమి దెబ్బతిందని ఎంత ప్రచారం చేస్తున్నప్పటికీ, సాధారణ ప్రజల్లో గానీ, ఓటర్లలో గానీ ఈ కథనాలపై విశ్వసనీయత కనిపించడం లేదు. 2024 ఎన్నికల్లో వచ్చిన భారీ విజయం కూటమి పునాది ఎంత బలంగా ఉందో స్పష్టం చేసింది. ప్రభుత్వపరంగా కీలక నిర్ణయాలు, సంక్షేమ పథకాల అమలు, అమరావతి పునర్నిర్మాణం వంటి ప్రతిష్టాత్మక అంశాల్లో చంద్రబాబు-పవన్ కల్యాణ్ ఇద్దరూ ఒకే మాటపై నడుస్తున్నారు. కాబట్టి కొన్ని చిన్న చిన్న గైర్హాజరులు , సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కూటమి బంధం బలహీనపడిందని వారు ఆనందపడే ప్రయత్నం చేస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు కూటమికి అసలైన సవాలుగా మారనున్నాయి. అసెంబ్లీ ఎన్నికల విజయాన్ని క్షేత్రస్థాయిలో నిలబెట్టుకోవాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల మధ్య సంపూర్ణ సమన్వయం అవసరం. గ్రామ స్థాయిలో స్థానాల సర్దుబాటు, నామినేషన్ల ఖరారు విషయంలో ఇరు పార్టీల మధ్య ఎలాంటి ఘర్షణ వాతావరణం రాకుండా చూసుకోవడమే అధినేతలకున్న పెద్ద టాస్క్. కింది స్థాయి క్యాడర్‌ను ఒకే వేదికపైకి తెచ్చి పోటీకి దించగలిగితే కూటమి తిరుగులేని ఆధిపత్యాన్ని ప్రదర్శించవచ్చు. పవన్ కల్యాణ్ గైర్హాజరుపై వస్తున్న ఊహాగానాలకు తెరపడాలంటే ఇరు పార్టీలు మరింత వ్యూహాత్మకంగా వ్యవహరించాల్సి ఉంది.

## వెలిగొండ నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదు

-మొదటిపేజీ తరువాయి

రూ.318 కోట్లు చెల్లించగా, తాజాగా మరో 1600 కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కులు అందాయి. దీంతో 4157 నిర్వాసిత కుటుంబాలకు ఇప్పటివరకు రూ.518 కోట్ల పరిహారం అందించినట్లైంది. త్యాగం చేసిన నిర్వాసితులకు అండగా నిలవడమే తమ సర్కార్ ధ్యేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. వెలిగొండ కోసం భూములు, ఇళ్లు కోల్పోయిన కుటుంబాలకు పరిహారం అందిస్తూ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. ఇప్పటివరకు రూ.518 కోట్లు పరిహారం చెల్లించామని, మిగిలిన మొత్తాన్ని కూడా త్వరలో విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. మంచి చేసే ప్రభుత్వాలను ప్రజలు గుర్తించాలని, నిర్వాసితుల త్యాగాలను ప్రభుత్వం ఎప్పటికీ మరచిపోదని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ నిర్వాసితులు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. 30 ఏళ్ల కల నెరవేరిందని సంతోషం వ్యక్తం చేశారు. మరోవైపు సొంత ఇళ్లు నిర్మించుకున్న కుటుంబాలకు పరిహారం అందించడంతోపాటు పునరావాస కాలనీల్లో మౌలిక వసతులపై సర్కార్ దృష్టి సారించింది. మొత్తం ఏడు ఆర్అండ్ఆర్ కాలనీల్లో వసతుల కల్పన చేపట్టగా పనులు దాదాపు పూర్తయ్యాయి. దీంతో నిర్వాసిత కుటుంబాలు పునరావాస కాలనీలకు తరలివెళ్తున్నాయి. అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడిన వెలిగొండ నిర్వాసితులతో కలిసి నేతలు మాట్లాడారు. వెలిగొండ నిర్వాసితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం వెనక్కి తగ్గదని నేతలు స్పష్టం చేశారు. మిగిలిన రూ.400 కోట్ల పరిహారాన్ని కూడా త్వరలో చెల్లిస్తామని చెప్పారు. ఈ నెలలోనే నల్లమల సాగర్‌కు నీరందిస్తామని తెలిపారు. పూర్తికాని వెలిగొండ ప్రాజెక్టు పూర్తైనట్లు జగన్ జాతికి అంకితం చేయడం ప్రపంచంలో ఎనిమిదవ వింతని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మండిపడ్డారు. 'కూటమి ప్రభుత్వం ఈ ప్రాజెక్టు పనులను ఓ క్రమపద్ధతిలో పూర్తి చేసింది. నిర్వాసితులకు రూ.900 కోట్ల పరిహారం చెల్లింపులో వైఎస్ జగన్? పైసా కూడా చెల్లించలేదు. వెలిగొండ పనులు పూర్తి చేయడం ఎంత ముఖ్యమో నిర్వాసితులు కూడా అంతే ముఖ్యం. నిర్వాసితులకు సంబంధించిన ఏడు కాలనీల్లో నాలుగు కాలనీల్లో 100 శాతం మౌలిక వసతులు పూర్తయ్యాయి. మిగిలిన మూడు కాలనీల్లో పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని' నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

వెలిగొండ విషయంలో గత ప్రభుత్వం నిర్వాసితులను, రైతులను తీవ్రంగా మోసం చేసిందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి ఆరోపించారు. పూర్తికాని ప్రాజెక్టును పూర్తైనట్లు ప్రకటించి జాతికి అంకితం చేసిన ఘనత వైఎస్సార్సీపీకే దక్కుతుందని విమర్శించారు. ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబే తిరిగి దీన్ని ప్రారంభిస్తున్నారని చెప్పారు. నిర్వాసితులు గ్రామాలను ఖాళీ చేసి పునరావాస ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు. మరోవైపు చెప్పినట్లుగానే మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేశామని ఆయన గుర్తు చేశారు. వెలిగొండ నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించిన తర్వాతే నీటిని విడుదల చేస్తామని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. గత ఐదేళ్లలో రైతులకు జరిగిన అన్యాయాన్ని ప్రజలు గుర్తించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును క్రమపద్ధతిలో పూర్తి చేయడంతోపాటు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికీ సమాన ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడించారు. తమకు జిల్లాతో పాటు వెలిగొండ పూర్తి చేసిన సీఎం పేరు మీద చంద్రన్న మార్కాపురం జిల్లాగా పేరు పెట్టాలని 117 మంది శాసనసభ్యులు సంతకాలు చేశారని కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు.

**ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేం**

ముఖ్యమంత్రి చంద్రబాబు తమకు అన్ని సౌకర్యాలు కల్పించారని నిర్వాసితులు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేసిన సాయం మర్చిపోలేమన్నారు. తాము చూడలేం అనుకున్న ప్రాజెక్టు పూర్తయినందుకు ఆనందంగా ఉందని భావోద్వేగానికి గురయ్యారు. మొత్తంగా వెలిగొండ నిర్వాసితుల త్యాగాలకు పరిహారంతో ప్రభుత్వం భరోసా కల్పించింది. మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ ఈ ప్రాజెక్టు పూర్తికి అడుగులు వేగవంతమయ్యాయి. ఇక నల్లమలసాగర్ జలాలతో ప్రకాశం ప్రాంత రైతుల కలలు సాకారం కావడమే లక్ష్యంగా సర్కార్? ముందుకు సాగుతోంది.

## క్షేత్రస్థాయి కేడర్ పై జగన్ గురి

**విజయవాడ :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాజకీయంగా మరోసారి ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నాన్ని వేగవంతం చేస్తున్నారు. 2024 ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాజయం తర్వాత కొంతకాలం పార్టీ కార్యాలయానికే పరిమితమైన ఆయన ఇటీవల వరుస పర్యటనలు చేపడుతున్నారు. ఈ పర్యటనలు కేవలం పార్టీ నేతలను పరామర్శించేందుకే కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజల పరిస్థితిని అర్థం చేసుకునేందుకు కూడా ఉపయోగపడుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.జగన్‌కు దాదాపు రెండు దశాబ్దాల రాజకీయ అనుభవం ఉంది. ఈ కాలంలో ఎదురైన విజయాలు, పరాజయాల నుంచి ఆయన ఎన్నో విషయాలు నేర్చుకున్నారని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. ముఖ్యంగా ప్రజల స్పందనను అంచనా వేయడంలో జగన్‌కు మంచి అవగాహన ఉందనే అభిప్రాయం ఆయన అనుచరుల్లో ఉంది. గత ఎన్నికల్లో పార్టీకి ఎదురైన ఫలితాలకు కేవలం ప్రభుత్వ వ్యతిరేకత మాత్రమే కారణం కాదని, సంస్థాగతంగా జరిగిన లోపాలు కూడా కీలక పాత్ర పోషించాయని వైసీపీ నాయకత్వం గుర్తించినట్లు తెలుస్తోంది.ఎన్నికల అనంతరం పార్టీ శ్రేణుల్లో కొంత నిరుత్సాహం కనిపించింది. పలువురు నాయకులు, కార్యకర్తలు రాజకీయంగా క్రియాశీలత తగ్గించుకోవడంతో క్షేత్రస్థాయిలో వైసీపీ బలహీనపడిందనే భావన ఏర్పడింది. ఈ నేపథ్యంలో జగన్ స్వయంగా ప్రజల్లోకి రావడం పార్టీ క్యాడర్‌కు కొత్త ధైర్యాన్ని ఇచ్చిందని వైసీపీ వర్గాలు చెబుతున్నాయి.ఇటీవల గోదావరి జిల్లాలు, ఉత్తరాంధ్ర, కర్నూలు ప్రాంతాల్లో జగన్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలిరావడం పార్టీ నాయకుల్లో ఆసక్తిని పెంచింది. ఈ స్పందనను వైసీపీ నాయకత్వం రాజకీయంగా అనుకూల సంకేతంగా భావిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల్లో పార్టీకి పూర్తిగా ఆదరణ తగ్గిపోలేదని, సరైన కార్యక్రమాలతో తిరిగి బలపడే అవకాశం ఉందనే నమ్మకం కార్యకర్తల్లో ఏర్పడుతోందని సమాచారంఅయితే కేవలం జనసమీకరణతోనే రాజకీయ విజయాన్ని సాధించడం సాధ్యం కాదనే విషయం కూడా వైసీపీకి తెలుసని పరిశీలకులు అంటున్నారు. గతంలో జరిగిన సంస్థాగత లోపాలను సరిదిద్దడం, నియోజకవర్గ స్థాయిలో నాయకుల మధ్య సమన్వయం పెంచడం, కార్యకర్తలను మళ్లీ చురుగ్గా పనిచేసేలా చేయడం కీలకంగా మారనుంది. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు పార్టీకి స్పష్టమైన కార్యాచరణ అవసరం.ఇదే సమయంలో జగన్ పర్యటనలు కూటమి పార్టీల్లో కూడా రాజకీయ చర్చకు కారణమవుతున్నాయని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం ప్రభుత్వం రెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న దశలో ప్రతిపక్ష నేతగా జగన్ ప్రజల్లో చురుగ్గా తిరగడం రాబోయే రాజకీయ సమీకరణాలపై ప్రభావం చూపవచ్చనే అంచనాలు ఉన్నాయి.మొత్తంగా చూస్తే జగన్ పర్యటనలు వైసీపీకి రాజకీయంగా మళ్లీ చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నంగా కనిపిస్తున్నాయి. ఇకపై కూడా ఇదే దూకుడును కొనసాగిస్తూ జిల్లాల వారీగా పర్యటనలు నిర్వహించాలని పార్టీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీని పునర్నిర్మించడమే లక్ష్యంగా జగన్ ముందుకు సాగితే, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరిన్ని ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉంది

**మండలిలో..**

ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాల తొలి రోజే ప్రధాన ప్రతిపక్షమైన వైఎస్సార్‌సీపీ అనుసరించిన వ్యూహాత్మక వైఖరి రాజకీయంగా తీవ్ర విమర్శలకు దారితీసింది. ప్రజా సమస్యలపై పోరాడేందుకు దక్కిన అత్యున్నత రాజ్యాంగ వేదికైన శాసనసభను బహిష్కరించి, కేవలం శాసనమండలిలో డీఎస్సీపై వాయిదా తీర్మానం ఇవ్వడం ద్వారా ఆ పార్టీ తన బలహీనతను తానే బయటపెట్టుకుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అసెంబ్లీలో ప్రజాప్రతినిధులుగా గొంతు విప్పాల్సిన 11 మంది ఎమ్మెల్యేలు సభకు రాకుండా ముఖం చాటేయడం పార్టీ ప్రజాస్వామిక విశ్వసనీయతను ప్రజల్లో తీవ్రంగా దెబ్బతీస్తోంది.విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పూర్తి గణాంకాలతో ప్రతిపక్ష వైఖరిని ఎండగడుతూ.. అసెంబ్లీకి వచ్చి డీఎస్సీ సహా ఏ అంశంపైనైనా చర్చించాలని పదేపదే విసిరిన సవాల్‌కు వైఎస్సార్‌సీపీ నుంచి అత్యంత పేలవమైన స్పందన వచ్చింది. సభలో ఉన్న ప్రజాప్రతినిధులెవరూ ఆ సవాల్‌ను స్వీకరించే సాహసం చేయకపోగా, సభకు వచ్చే అర్హతే లేని మాజీ మంత్రి పేర్ని నాని బయట మీడియా ముందుకొచ్చి తాను చర్చకు వస్తానని ప్రకటించడం రాజకీయ విశ్లేషకులను విస్మయానికి గురిచేసింది. ఎన్నికైన 11 మంది ఎమ్మెల్యేలలో ఏ ఒక్కరూ లోకేష్ సవాల్‌ను ఎదుర్కొనేందుకు ముందుకు రాకపోవడం పార్టీలోని నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తోంది.ప్రజా సమస్యలపై సభలో నిలదీయకుండా గురువారం నాటి ప్రెస్ మీట్‌కు వాయిదా వేసుకోవడం ద్వారా ప్రతిపక్షం తనకు తానే రాజకీయంగా మరింత ఆత్మరక్షణలో పడింది.

# స్పెషల్ ఆఫీసర్ సాయి రాజు అధ్యక్షతన గూటాలలో గ్రామసభ..

నిలిచిపోయిన గూటాల ఫెర్రీ రేవు పునః ప్రారంభానికి ప్రజాభిప్రాయ సేకరణ..

**పోలవరం మీ వార్త ఆగస్టు 19** ఏలూరు జిల్లా పోలవరం మండలం గూటాల గ్రామంలో స్పెషల్ ఆఫీసర్ పోలవరం తహసిల్దార్ సాయిరాజు ఆధ్వర్యంలో బుధవారం గ్రామ సభ నిర్వహించి గత కొన్ని ఏళ్లుగా నీలిచిపోయిన గూటాల ,వంగలపూడి పెర్రి రేవు గురించి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిధులుగా పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి ఎంపీడీఓ జి. మాణికుమారి పాల్గొన్నారు. అనంతరం గ్రామానికి కావలసిన అభివృద్ధి పనులను గుర్తించడం మరియు ప్రణాళికలు తయారు చేయడం,ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయడం,గ్రామ పంచాయతీ వార్షిక బడ్జెట్, ఆదాయ-వ్యయాలను పరిశీలించి ఆమోదించడం,గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు వంటి ప్రాథమిక సౌకర్యాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం వంటి వంటి పలు అంశాలపై చర్చించారు.
గూటాల పేర్రీ రేవు నుండి పడవ ప్రయాణం ద్వారా వంగలపూడి, సీతానగరం, రాజమండ్రి పరిసర గ్రామాలకు తక్కువ ఖర్చుతో అతి తక్కువ సమయంలో చేరుకోవచ్చని గూటాల ఫెర్రీ రేవును పునః ప్రారంభించాలని తహసిల్దార్ ను గ్రామస్తులు కోరారు. గూటాల పేర్రీ రేవు కు సంబంధించిన అన్ని విషయాలను, ప్రజల అభిప్రాయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి ఫెర్రీ రేవు పునః ప్రారంభించేందుకు కృషి చేస్తానని తహసిల్దార్, ఎంపీడీవో లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో రవికుమార్, ఏవో సిహెచ్ శ్రీనివాస్ బాబు, డిప్యూటీ తహసీల్దార్ కంభంపాటి శ్రీనివాసరావు, పోలవరం ఎస్సై పి. అప్పారావు,గూటాల సెక్రటరీ పద్మశ్రీ,, పట్టిసీమ సెక్రటరీ యు. రాజారావు, టిడిపి మాజీ మండల అధ్యక్షులు పాపోలు గణపతి రత్తయ్య, ఏనుగుల శ్రీనివాస్, జనసేన నాయకులు ఆటపాక వెంకటేశ్వరరావు, బిజెపి నాయకులు గంటా శ్రీను,కూటమి నాయకులు



సచివాలయం సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# గూటాల సచివాలయంలో సీసీ కెమెరాలు, సైబర్ క్రైమ్, మహిళా భద్రతపై అవగాహన

పోలవరం ఎస్సై పి. అప్పారావు...

**పోలవరం మీ వార్త ఆగస్టు 19** ఏలూరు జిల్లా ఎస్పీ కె. ప్రతాప్ శివ కిషోర్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, పోలవరం డీఎస్పీ కె. జయకృష్ణ సూచనలతో ఈరోజు పోలవరం మండలం గూటాల గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎస్సై పి. అప్పారావు మాట్లాడుతూ గ్రామ ప్రజలందరూ సమిష్టిగా సహకరించి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో దొంగతనాలు మరియు ఇతర నేరాలను అరికట్టడంతో పాటు, ఏదైనా నేరం జరిగినప్పుడు నిందితులను త్వరగా గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి, అలాగే ప్రమాదాలు, మిస్సింగ్ కేసులు తదితర సంఘటనలను ఛేదించడానికి సీసీ కెమెరాల ఫుటేజ్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.అదేవిధంగా మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ, అత్యవసర పోలీస్ సేవల కోసం 112 నంబర్, సైబర్ మోసాలపై ఫిర్యాదుల కోసం 1930 హెల్ప్‌లైన్, సి ఈ ఐ ర్ పోర్టల్, 360 డిగ్రీ సీసీ కెమెరాల వినియోగం గురించి ప్రజలకు వివరించారు. గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూ, వాటికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల అక్రమ రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు.అలాగే రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం వంటి అంశాలపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ



కార్యక్రమంలో పోలవరం తహసీల్దార్ సాయిరాజు, డిప్యూటీ తహసిల్దార్ కే. పంచాయతీ కార్యదర్శి పద్మశ్రీ, మహిళా పోలీస్ స్వాతి, పోలీసు సిబ్బంది, ఇతర శాఖల అధికారులు మరియు గూటాల గ్రామ ప్రజలు పాల్గొన్నారు. గ్రామంలో నేరాల నివారణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

# కృష్ణా జిల్లా లో లెప్టోస్పిరోసిస్ శిక్షణా వర్క్‌షాప్ --

**మచిలీపట్నం ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)**
లెప్టోస్పిరోసిస్ వ్యాధి వ్యాప్తి (అవుట్‌బ్రేక్) దర్యాప్తు మరియు ప్రతిస్పందనపై రెండు రోజుల సిమ్యులేషన్ ఆధారిత శిక్షణా వర్క్‌షాప్‌ను 2026 ఆగస్టు 18--19 తేదీలలో కృష్ణా జిల్లాలోని ధాత్రి కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆగస్టు 18న డి ఎం అండ్ హెచ్ ఓ, డి ఎ హెచ్ ఓ మరియు డి ఎస్ ఓ లు ప్రారంభించారు. వన్ హెల్త్ విధానంలో భాగంగా వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.
ఈ శిక్షణలో మానవ ఆరోగ్యం, పశుసంవర్ధక శాఖ, పాఠశాల ఆరోగ్యం, బిసి ఎస్ సి ఎస్ టి సంక్షేమం, ఆహార భద్రత మరియు వైద్య విద్య శాఖలకు చెందిన సిబ్బంది పాల్గొన్నారు. వ్యాధి ముందస్తు గుర్తింపు, నిఘా, ప్రయోగశాల నిర్ధారణ, వ్యాధి వ్యాప్తి దర్యాప్తు, కేసుల నిర్వహణ, పర్యావరణ పరిస్థితుల అంచనా, ప్రమాద సమాచార ప్రసారం మరియు సమన్వయంతో కూడిన




ప్రతిస్పందన వంటి అంశాలపై శిక్షణ అందించారు. ముఖ్యంగా భారీ వర్షాలు మరియు వరదలు సంభవించే సమయంలో లెప్టోస్పిరోసిస్ వ్యాధి వ్యాప్తిని నివారించడం మరియు నియంత్రించడం కోసం, వివిధ శాఖల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, జిల్లా స్థాయి సన్నద్ధతను పెంపొందించడం మరియు వ్యాధి వ్యాప్తికి వేగవంతంగా స్పందించే సామర్థ్యాన్ని మెరుగుపరచడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా ఉంది.

# అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా






**మలికిపురం ఆగస్ట్ 19 ( మీ వార్త విలేఖరి ఐ రవి)**
నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, నిరుద్యోగ భృతి ఇవ్వాలని, నూతన పరిశ్రమలను స్థాపించాలని తదితర డిమాండ్ల పరిష్కారం చేయాలని బుధవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం తాసీల్దార్ కార్యాలయం వద్ద అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్ ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి తాసీల్దార్ కు మెమోరాండం సమర్పించారు. ఈ మేరకు ధర్నాల్లో పాల్గొన్న సీపీఐ జిల్లా కార్యదర్శి దేవ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఖాళీగా ఉన్న ఉద్యోగ పోస్టులను భార్టీ చేయాలని, జిల్లాలో గ్యాస్ ఆధారిత, కొబ్బరి ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి యువతకు ఉద్యోగాలు కల్పించాలని, నెలకు 3000/- రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వాలని,రాజోలు ఎస్సీ బాలుర వసతి గృహాన్ని వెంటనే నిర్మించి విద్యార్థులకు న్యాయం చేయాలని అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చే పడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఏఐవైఎఫ్ రాజోలు నియోజకవర్గ కన్వీనర్ వై వెంకట్, నాయకులు పి ఆనంద్, వి చిట్టిబాబు, డి రమేష్ యడ్ల మాణిరావు లు నాయకత్వం వహించగా దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల. మురళి కృష్ణ, మట్టా. చిలకపాటి. శ్రీధర్, బుంగ శ్రీను, దళిత జేఏసీ నాయకులు తోటే. ప్రతాప్, ఎస్సీ వెల్ఫేర్ రాజోలు మండల కన్వీనర్ మట్టా సురేష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు అరుణ్, విజయ్, ఎండీ రషీద్ తదితరులు మద్దతు తెలియచేసారు.

## అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తికి ఉప్పాల ఆర్థిక సాయం

**పెడన ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** కృష్ణాజిల్లా పెడన మండలం దావోజిపాలెం గ్రామానికి చెందిన కటికల యాకోబు 65 సం"గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉంటూ మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న లిపెడన నియోజ్యకవర్గ వైస్సార్సీపీ ఇంచార్జి శ్రీ ఉప్పాల రాము కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు..



## ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం లో టీడీపీ నాయకులు నక్కా సునీల్



**పి గన్నవరం, ఆగస్టు 19 (మీ వార్త విలేఖరి)** మండలం పరిధిలోని కే ఏనుగుపల్లి గ్రామంలో టిడిపి గ్రామ శాఖ అధ్యక్షులు సొసైటీ చైర్మన్ బొరుసు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం చేపట్టి స్థానిక ప్రజలకు కరపత్రాలు అందించి కూటమి ప్రభుత్వం పథకాలు అభివృద్ధి నమ్మకం గురించి తెలియజేసి మై టీడీపీ యప్ లొ నమోదు చేశారు . ఈ కార్యక్రమంలో పాల్గొన్న్రి ఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్ రాజు , టిడిపి ప్రధాన కార్యదర్శి మట్టపర్తి దుర్గప్రసాద్,గుండుబోగుల చంటి ,యువ నాయకులు షేరు ప్రసాద్ వర్మ, శేరు రాంబాబు, మల్లాడి శ్రీను మరియు నియోజకవర్గం తెలుగు యువత సోషల్ మీడియా సభ్యులు వేమన గంగాధర్ తదితరులు పాల్గొన్నారు

## ఏపీ ట్రైకార్ చైర్మన్ బోరగం శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో క్యాడర్ సమావేశం.

**పోలవరం,మీ వార్త ఆగస్టు 19** పోలవరం మండలంలోని తెలుగుదేశం పార్టీ



కార్యాలయంలో క్యాడర్ సమావేశం బుధవారం ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పోలవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు హాజరై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలను వివరించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తకు నాయకత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలను విస్తృతం చేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంగిన వెంకటరమణ, డోకుల నాగేశ్వరావు, ఆకుల రాజా,పోతుల శ్రీను, పాదం ప్రసాద్, వి. మంగతయరు చిన్నారి, కోడి శ్రీను, యడ్ల వినోద్, పిల్లి నాగరాజు, మాగంటి రాము, నల్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ రమణ కు ఘన సత్కారం

**పెడన ఆగస్టు 19:(మీ వార్త ప్రతినిధి)**
187వ ప్రపంచ ఫోటోగ్రఫీ దినోత్సవం పురస్కరించుకుని కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నంలో బుధవారం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(పెన్ యూనియన్)ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పెడన పట్టణానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ , జర్నలిస్ట్ పీవీ రమణ ను సన్మానించారు.



యూనియన్ రాష్ట్ర సంఘ అధ్యక్షుడు బడే ప్రభాకర్ నేతృత్వంలో నగరంలోని ఒక సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథి భారత రైల్వే సంస్థ ఇర్కాన్ (ఢిల్లీ) అదనపు జనరల్ మేనేజర్ మరియు ఢిల్లీ తెలుగు అసోసియేషన్ ఉపాధ్యక్షులు మెండు చక్రపాణి,
చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఫోటోగ్రఫీ రంగంలో సుధీర్ఘ సేవలకు అభినందనలు తెలిపారు. విద్యావేత్త కొండవీటి ఈశ్వరరావు, వైద్యశాఖ ఈఈ మెండు లింగయ్య నాయుడు, సీనియర్ జర్నలిస్ట్ "పెన్ " వర్కింగ్ ప్రెసిడెంట్ సింహాద్రి కృష్ణ ప్రసాద్, ప్రముఖ న్యాయవాదులు,సోడిశెట్టి బాలాజీ రావు,ఎం. దుర్గాప్రసాద్, బడే జీవన్, తదితరులు పాల్గొన్నారు.

## జాబ్ మేళాలో 35 మంది అభ్యర్థులు ఎంపిక





**అమలాపురం ఆగస్టు 19 మీవార్త ప్రతినిధి** జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో మిరియం డిగ్రీ కాలేజీ అమలాపురం లో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన వచ్చింది.ఈ జాబ్ మేళా కి 35 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు.జాబ్ మేళాను డి.ఈ.ఎస్.ఓ.ఆర్ వహీదా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుకున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించటమే ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు విద్యార్థులు చదువుతోపాటు నైపుణ్యాలను అభివృద్ధి పరచుకోవాలని తెలిపారు.10 కంపెనీలు పాల్గొన్న ఈ జాబ్ మేళాకు 92 మంది అభ్యర్థులు హాజరు కాగా, పలు కంపెనీలకు 35 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎంప్లాయిమెంట్ ఁ స్కిల్ ఆఫీసర్ ఆర్. వహీదా,ప్రిన్సిపాల్ యన్.తమ్మేశ్వరరావు,జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఓ.నాగబాబు,కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్ కె.స్వామినాయుడు యన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ కె. శ్రీహరిబాబు,పి. కన్యాకుమారి,జె. నాగేశ్వరరావు మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల కల్పించడం అభినదనీయం

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు

**భీమవరం ఆగస్టు 19 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించడం అభినందనీయం అని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు అన్నారు.పశ్చిమగోదావరి జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు వర్తనపల్లి కాశి అధ్యక్షతన మీడియా సమావేశం నిర్వహించారు.బీసీల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి కేశన శంకర్రావు మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ బీసీలకు 27% రిజర్వేషన్ కల్పించాలని నివేదిక ఇచ్చినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ లోని జీవోలను సవరించి స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేసేందుకు బీసీలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించడం హర్షనీయం అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగాలంటే కులగణన జరగాల్సిందే అన్నారు.బీసీలను ఏబిసిడిలుగా వర్గీకరించి



అధిక జనాభా గల బీసీ కులాలకు 34% రిజర్వేషన్ వర్తింపచేసి ఉద్యోగం రాజకీయాల్లో అవకాశం కల్పించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జనగణనతో పాటు కుల గణన జరిపించి దేశంలోనే 60 శాతం పైబడి జనాభా గల బీసీలకు సముచిత న్యాయం కల్పించాలన్నారు.వర్తనపల్లి కాశీ మాట్లాడుతూ అసెంబ్లీ సాక్షిగా చట్టాన్ని సవరిస్తూ బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. శాసనసభలో ఏకపక్షంగా తీర్మానం చేయడం పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్,శాసనసభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. కులగణన, ఏబిసిడి వర్గీకరణ విషయమై ముఖ్యమంత్రిని, ఉపముఖ్యమంత్రిని కలిసామని, దానికి అనుగుణంగా నేడు పంచాయతీలలో 34%, మున్సిపాలిటీలలో 33% రిజర్వేషన్ కల్పించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బల్లా పరమేశ్వర రావు,కొడవర్తి శివప్రసాద్, తాడేపల్లిగూడెం నియోజకవర్గం అధ్యక్షుడు కేశవభట్ల విజయ్, అత్తిలి బాబి, మారిశెట్టి నరసింహమూర్తి, సతీష్, తిరుమల రావు తదితర బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యం: వలవల బాబ్జి

**తాడేపల్లిగూడెం ఆగస్టు 19 (మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా టిడిపి శ్రేణులు పనిచేయాలని తెలుగుదేశం పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) అన్నారు.బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశం పట్టణ అధ్యక్షుడు పట్నాల రాంపండు అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా వలవల బాబ్జి మాట్లాడుతూ బలహీన వర్గాలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని అన్నారు.జగన్మోహన్ రెడ్డి పాలనలో బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు తగ్గిస్తే, ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం 34 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించడం బీసీల పట్ల చంద్రబాబుకు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. తెలుగుదేశం పార్టీకి మూల స్తంభాలు బీసీలేనని తెలిపారు.. తెలుగుదేశం పార్టీ 44 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో బలహీన వర్గాలే అధిక శాతం పార్టీ వెంట నడిచారని చెప్పారు.బీసీల డిమాండ్లను పరిగణలో తీసుకుని 34% రిజర్వేషన్లను కల్పించే విధంగా నిర్ణయం తీసుకోవడం గర్వనీయం అన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నాటినుండి ఎందరో కేంద్ర మంత్రులుగా బాధ్యతలు చేపట్టారన్నారు.బీసీ నాయకులు కింజరపు ఎర్రన్నాయుడు, యనమల రామకృష్ణుడు, దేవేంద్ర గౌడ్,చింతకాయల అయ్యన్నపాత్రుడు వంటి వారు తెలుగుదేశం పార్టీ ద్వారా కీర్తిని గడించారన్నారు.స్వర్గీయ నందమూరి తారక రామారావు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు పెద్దపీట వేసి సర్పంచ్, మండల అధ్యక్షుడు,జిల్లా పరిషత్ చైర్మన్ వంటి పదవులలో కూర్చోబెట్టారని గుర్తుచేశారు.తొలి నుండి బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పెంచుతూ నిర్ణయం తీసుకున్న సందర్భంగా స్వర్గీయ ఎన్.టి.రామారావు చిత్రపటానికి వలవల మల్లికార్జునరావు,పార్టీ శ్రేణులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.కార్యక్రమానంతరం తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు,మాజీ ముఖ్యమంత్రి,స్వర్గీయ నందమూరి తారక రామారావు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విగ్రహాలకు పాలాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో గొర్రెల



శ్రీధర్,కిలపర్తి వెంకట్రావు,దాసరి అప్పన్న,సనగన శ్రీనివాస్ గౌడ్, తెలుగుదేశం పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

# దళితులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ,,

**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్ట్ 19 :** పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న అంబేద్కర్ కాలనీలో గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న దళిత కుటుంబాలకు ఇండ్ల పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ బుధవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దళితులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎం. సత్యనారాయణ మాట్లాడుతూ... రాష్ట్ర హోం మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న పాయకరావుపేట నియోజకవర్గంలోనే దళిత కుటుంబాలకు ఈ పరిస్థితి రావడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ నేపథ్యంలో అంబేద్కర్ కాలనీ దళితులు తమ హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని నిర్ణయించుకుని బుధవారం పాయకరావుపేట పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. తమ ఇళ్లను కాపాడుకునేందుకు ఎటువంటి పరిస్థితుల్లోనైనా పోరాటం కొనసాగిస్తామని దళిత కుటుంబాలు స్పష్టం చేశాయి. దళితుల ఇళ్లు



కూల్చేందుకు బుల్డోజర్లు కాదు, దళితుల సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు ముందుకు రావాలన్నారు. పట్టాలు ఇచ్చే వరకు ఒక్క కుటుంబాన్ని కూడా అక్కడి నుంచి కదిలించలేరన్నారు. దళితుల ఇళ్లపైకి బుల్డోజర్లు వస్తే సీపీఎం చూస్తూ ఊరుకోదనీ, దళితుల పక్షాన నిలబడి వారి హక్కుల కోసం ప్రజా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మనబాల రాజేష్, పాయకరావుపేట మండల నాయకులు బత్తిన నాగేశ్వరరావు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో దమ్ము చిన్న బుజ్జి,




ఏళ్ళ అంజిమ్మ, ఆకుల లలిత, మాణిక్యం దేవి, సేవా శిరీష, గారా ఏసురత్నం, జక్కన నాగలక్ష్మి, కొత్తలంక రత్నం, ఎత్తుల రాజు, జక్కల కుశల, రావాడ శివ, గారా నాని, గశీపల బాబ్జి, గారా నంద, ఇసరుపు నరసింహ, ఆకుల నాగరాజు, ఏళ్ళ గోపీ, గారా పెద్ద, నాని, తదితరులు పాల్గొన్నారు.

# సాటి మనిషికి సహాయపడటంలోనే మానవ జన్మకు సార్ధకత

సంపదలు, పదవులు, హోదాలు శాశ్వతం కాదు, చేసిన మంచి పనులే శాశ్వతం

ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ సందేశం

రామచంద్రపురం (మీ వార్తా ప్రతినిధి ఆగస్టు 19): ప్రపంచ మానవతా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మానవత్వమే మనిషిని మహోన్నతుడిగా నిలబెట్టే గొప్ప విలువ అని పేర్కొన్నారు. సాటి మనిషి కష్టంలో ఉన్నప్పుడు అండగా నిలవడం, ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, కన్నీటి పర్యంతమైన కుటుంబాలకు ఓదార్పునివ్వడం, బాధలో ఉన్నవారికి భరోసా కల్పించడంలోనే మానవ జన్మకు నిజమైన సార్థకత ఉందని మంత్రి అన్నారు. సంపదలు, పదవులు, హోదాలు శాశ్వతం కావని, కానీ మనం చేసిన మంచి పనులు, చూపిన మానవత్వం మాత్రం శాశ్వతంగా ప్రజల హృదయాల్లో నిలిచిపోతాయని పేర్కొన్నారు. పేదల పట్ల ప్రేమ, కనికరం, జాలి, దయ కలిగి ఉండడం ప్రతి మనిషి ప్రాథమిక బాధ్యత అని మంత్రి తెలిపారు. సమాజంలో బలహీన వర్గాలను ఆదుకోవడం, నిరుపేదలకు చేయూతనివ్వడం, అవసరంలో ఉన్నవారిని ఆదరించడం ద్వారా మానవత్వం మరింత బలపడుతుందన్నారు. ఈ సందర్భంగా బైబిల్‌లోని "నీ వలే నీ పొరుగు వారిని ప్రేమించు" అనే మహోన్నత సందేశాన్ని మంత్రి గుర్తు చేశారు. మతాలు వేర్వేరు అయినా మానవత్వం ఒక్కటేనని, ప్రేమ, దయ, సేవాభావమే అన్ని మతాల సారాంశమని పేర్కొన్నారు. "మనిషి గొప్పతనం అతని సంపదలో కాదు... ఇతరుల కన్నీరు తుడిచే హృదయంలో ఉంటుంది. ఒకరి జీవితంలో వెలుగు నింపగలిగితే అదే నిజమైన విజయం. ఒకరి బాధను పంచుకోగలిగితే అదే నిజమైన మానవత్వం" అని మంత్రి సుభాష్ అన్నారు. ప్రతి ఇంట్లో మానవత్వం వికసించాలని, ప్రతి హృదయంలో ప్రేమ పరిమళించాలని, ప్రతి చేయి సేవ కోసం ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. మానవత్వం, సేవాభావం, పరస్పర సహకారం పెరిగినప్పుడే సమాజం శాంతి, సౌభాగ్యాలతో ముందుకు సాగుతుందని మంత్రి పేర్కొన్నారు.

## తెలంగాణలో నిరుద్యోగులకు ఊరట వయోపరిమితి రెండేళ్లు పెంపు!

**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో యూనిఫామ్ ధరించి సమాజానికి సేవ చేయాలనే లక్షల మంది నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత కీలకమైన నిర్ణయంతో భారీ ఊరటనిచ్చింది. గత కొంతకాలంగా నోటిఫికేషన్ల ఆలస్యం, కరోనా తదనంతర పరిణామాల వల్ల వయసు మించిపోయి ఆందోళన చెందుతున్న అభ్యర్థుల విన్నపాలను ప్రభుత్వం సానుకూలంగా మన్నించింది. ఈ క్రమంలోనే వివిధ యూనిఫామ్ సర్వీసెస్ శాఖల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పోస్టులకు గరిష్ఠ వయోపరిమితిని అదనంగా మరో రెండేళ్లు పెంచుతూ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన తాజా జీవో నెంబర్ 122 ప్రకారం రాష్ట్రంలోని ఏడు ప్రధాన యూనిఫామ్ శాఖల్లో ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు వయోపరిమితి సడలింపు లభించనుంది. ఇప్పటికే మే 18, 2026 నుంచి ప్రభుత్వం ఐదేళ్ల వయోపరిమితి పెంపును అమలు చేస్తోంది. ఇప్పుడు దానికి అదనంగా మరో రెండేళ్లు జోడించడంతో అభ్యర్థులకు లభించే మొత్తం వయోసడలింపు ఏకంగా 7ఏళ్లు చేరింది. దీని వల్ల వయసు పైబడి పోటీకి దూరమవుతున్న వేలాది మంది అభ్యర్థులకు మళ్లీ ప్రాణం పోసినట్టు అయ్యింది.ఈ వయోపరిమితి పెంపు వర్తించే ప్రధాన శాఖలు ఏంటంటే... తెలంగాణ పోలీస్ శాఖ అయిన సివిల్ ఎస్ఐ కానిస్టేబుల్, ఏఆర్, టీఎస్ఎస్‌పీ , కమ్యూనికేషన్స్ పోస్టులకు వర్తిస్తుంది. అగ్నిమాపక శాఖలోని ఫైర్‌మెన్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్స్ పోస్టులకు ఇది అమలు అవుతుంది. జైళ్ల శాఖ డిప్యూటీ జైలర్, వార్డర్ పోస్టుల్లో వర్తింపజేస్తారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, ఎక్సైజ్ శాఖ, రవాణా శాఖ, అటవీ శాఖలోని ఉద్యోగాలకు కూడా వర్తింపజేస్తారు.

**ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుంది?**

## స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ప్రభుత్వానికి ధన్యవాదాలు

పడవల మోహన్ త్రినాథ్

ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి

**గూడూరు ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే నిర్ణయం తీసుకున్న ప్రభుత్వానికి ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి పడవల మోహన్ త్రినాథ్ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా బీసీలకు రాజకీయంగా మరింత ప్రాతినిధ్యం లభించడంతో పాటు, గ్రామీణ ప్రాంతాల్లో బీసీ వర్గాల నాయకత్వానికి కొత్త అవకాశాలు ఏర్పడతాయని ఆయన అన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం సామాజిక న్యాయ సాధనలో ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు.బీసీల అభ్యున్నతికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని, విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి రంగాల్లో బీసీలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని పడవల మోహన్ త్రినాథ్ కోరారు. బీసీల సంక్షేమం కోసం తీసుకున్న ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ప్రభుత్వం మరియు సంబంధిత ప్రజాప్రతినిధులకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.పడవల మోహన్ త్రినాథ్ ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి

## అనారోగ్యంతో మృతిచెందిన వ్యక్తికి కాగిత ఆర్థిక సాయం

దావోజిపాలెం గ్రామానికి చెందిన కటికల యాకోబు అనారోగ్యంతోమృతి

పి ఏ సి ఎస్ అధ్యక్షులు కాగిత నాగేశ్వరరావు సహాయం



**పెడన ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** కృష్ణాజిల్లా పెడన మండలం దావోజిపాలెం గ్రామానికి చెందిన కటికల యాకోబు 65 సం"గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో ఉంటూ మంగళవారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న దావోజీపాలెం పి ఏ సి ఎస్ అధ్యక్షులు కాగిత నాగేశ్వరరావు రూ 5000/- వేలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు..

## గ్రంధాలయాన్ని సందర్శించిన చైర్మెన్ జుత్తుగ నాగరాజు



**లింగపాలెం, ఆగస్టు 29 ( మీ వార్త విలేఖరి )** ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ శాఖ చైర్మన్ జుత్తుగ నాగరాజు లింగపాలెం లో ఉన్న గ్రంథాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం మండల జనసేన కార్యదర్శి వీర మహిళా సాయిల జ్యోతి , పొదిలి మహేష్, పంతం శ్రీను , పికా ఆది సికాకొల్లు వెంగళరావు మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లపై హర్షం వ్యక్తం చేసిన మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు..





**జీలుగుమిల్లి(.. మీ వార్త ప్రతినిధి)** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ కూటమి ప్రభుత్వం క్యాబ్ నెట్ లో ఆమోదం తెలపడం హర్షణీయమని జీలుగుమిల్లి మండల బీసీ సెల్ అధ్యక్షుడు తోట బాలు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్. విద్యాశాఖమంత్రి నారా లోకేష్. ఏలూరు ఎంపీ పుట్ట మహేష్ కుమార్ యాదవ్. పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుకు ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం బీసీల సంక్షేమం రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉందని ఆయన అన్నారు .. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీసీ సెల్ ఉపాధ్యక్షుడు బొలగాని సత్యనారాయణ. నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రంధాలయ రికార్డులను పరిశీలించిన చైర్మెన్ జుత్తిగ నాగరాజు



**టి. నరసాపురం, ఆగస్టు 19 ( మీ వార్త విలేఖరి ):** గ్రంధాలయాలు తనిఖీలలో భాగంగా జిల్లా గ్రంధాలయ ఛైర్మన్ జుత్తిగ నాగరాజు టి. నర్సాపురం గ్రామశీలోని గ్రంధాలయాన్ని బుధవారం సందర్శించి, రికార్డులను మరియు గ్రంధాలయం నిర్వాహణ తీరును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు సూచనల చేశారు. దీనిలో భాగంగా మండలం జనసేన పార్టీ అధ్యక్షులు, పి ఏ సి ఎస్ చైర్మన్ అడపా నాగరాజు మరియు టి నర్సాపురం గ్రామ అధ్యక్షులు పాలేటి సత్తిబాబు ఆయనను కలిసి సాలువ కప్పి సన్మానం చేసి పూలదండలు వేసి ఆయనకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం లో టి నర్సాపురం మండల జనసేన నాయుకులు కార్యకర్తలు, పాల్గొన్నారు..

## శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మహిళా భక్తులు పూజలు



**మచిలీపట్నం ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** విశ్వహిందూ పరిషత్ కృష్ణాజిల్లా ఆధ్వర్యంలో మచిలీపట్నం సర్కిల్ పేటలో వేంచేసిన శ్రీ సంతాన వేణుగోపాల స్వామి ఆలయంలో మాతృ శక్తి మహిళా మండలి సభ్యులు, మహిళా భక్తులు బుధవారం విష్ణు సహస్రనామ పారాయణ, కృష్ణాష్టకము, లలితా సహస్రనామ పారాయణ నిర్వహించారు. 30 మందికి పైగా మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం హారతి, ప్రసాద వినియోగం జరిగింది. లాటరీ విధానంలో పారాయణలో పాల్గొన్న మహిళలలో ఒక మహిళకు నూతన వస్త్రాలు బహుకరించారు. విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ బహుకరించిన నూతన వస్త్రాలను కూనపు రెడ్డి శ్రీగంగ చేతుల మీదుగా విజేత సాయి లత కు అందజేశారు. వందేమాతర గీతాన్ని భక్తిశ్రద్ధలతో మహిళలందరూ ఆలపించారు. కార్యక్రమంలో పాల్గొన మహిళ లకు డాక్టర్ బూరగడ్డ శ్రీనాథ్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ ఢీకొల్లు వెంకట్రావు, ధర్మకర్త జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం , అయ్యప్ప, ఆలయ పూజారి శేషు, వై సుధా అనురాధ కూనపు రెడ్డి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రతి బుధవారం సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

## గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్గా శ్రీ అజయ్ బాబు బాధ్యతల స్వీకరణ



**కోరుకొండ ఆగస్టు 18 (మీ వార్త ప్రతినిధి)**గోకవరం ఏపీఎస్ఆర్టీసీ నూతన డిపో మేనేజర్గా శ్రీఅజయ్ బాబు పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోకవరం డిపోపరిధిలోప్రయాణికులకు మరింత మెరుగైన, సురక్షితమైన,సౌకర్యవంతమైన రవాణా సేవలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సుల సమయపాలన, నిర్వహణ, సిబ్బంది పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. డిపో అభివృద్ధికి అధికారులు, సిబ్బంది,ప్రజలసహకారంతో సమష్టిగా పనిచేస్తానని అజయ్ బాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల వారు శ్రీ అజయ్ బాబుని అభినందించి, ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.

## "మాదక ద్రవ్యాలకు నో చెప్పండి -- జీవితానికి యెస్ చెప్పండి"

వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో




**మచిలీపట్నం ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** భారత ప్రభుత్వం బ్రహ్మకుమారీస్ సంస్థ సహకారంతో ఆగస్టు 2020 నుండి దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అవగాహన మరియు ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా బ్రహ్మకుమారి పృథ్వి గారు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, "మాదక ద్రవ్యాలకు నో చెప్పండి -- వ్యసన రహిత భారత నిర్మాణానికి కృషి చేద్దాం" అనే ప్రతిజ్ఞను చేయించారు. ఈ ప్రతిజ్ఞ కార్యక్రమంలో సుమారు 550 మంది విద్యార్థులు పాల్గొని వ్యసన రహిత సమాజ నిర్మాణానికి తమ అంకితభావాన్ని చాటుకున్నారు.
ఈ కార్యక్రమాన్ని వైస్ ప్రిన్సిపాల్ డా. బి. నాగ జ్యోతి గారు మరియు హెచ్ ఎ ఎస్ విభాగాధిపతి డా. అబ్దుల్ నబీ సమన్వయం చేశారు.

## స్వర్గీయ వంగవీటి మోహనరంగా రావు గారి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



**కృత్తివెన్ను ఆగస్టు 19 (మీ వార్త ప్రతినిధి)** బుధవారంన కృత్తివెన్ను మండలం కృత్తివెన్ను ప్రదాన సెంటర్లో బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి మాజీ శాసన సభ్యులు కీర్తిశేషులు స్వర్గీయ వంగవీటి మోహనరంగా రావు గారి విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ చేసిన మండల వి ఎమ్ రంగా గారి అభిమనులు గ్రామస్తులు అధికసంఖ్యలో భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్ల వైఫల్యం తో రోడ్లపై నీరు

ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు... పట్టించుకోని అధికార యంత్రాంగం



**జంగారెడ్డిగూడెం, ఆగస్టు 19 ( మీ వార్త ప్రతినిధి )** గత ప్రభుత్వ హయాంలో ఏలూరు జంగారెడ్డిగూడెం వెళ్లే ప్రధాన రోడ్డుపై ప్రయాణం చేయాలంటే భయభ్రాంతులకు గురి కావాల్సి వచ్చేది. అంతేకాదు మీకు ఇప్పుడు చూపిస్తున్న ఫోటో ప్రదేశమైన దేవులపల్లి వద్ద ప్రజలు నరకయాతన పడ్డారు. రోడ్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎక్కువగా ఉండేవి కూటమి ప్రభుత్వం వచ్చాక కోట్ల రూపాయలు ఖర్చు చేసి నూతన రోడ్లు వేశారు. ప్రయాణ సౌకర్యం మెరుగుపడింది. కానీ కాంట్రాక్టర్లు పనిని తూతూ మంత్రంగా చేశారు. రోడ్డు పక్కన వర్షపు నీరు వెళ్లే డ్రైనేజీ, అవుట్ లెట్ ఏర్పాటు చేయలేదు. దాని వల్ల వర్షం పడితే నీరు అంతా రోడ్డు మీదే నిలుస్తోంది - పైగా రోడ్డు మార్జిన్లు ఆక్రమణకు గురవుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా ఇప్పుడే వేసిన కోట్ల రూపాయల రోడ్డు త్వరగా పాడైపోయే ప్రమాదం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇది ప్రజాధనం వృథా కావడమే కాదు, ప్రమాదాలకు కూడా కారణమవుతుందని అటు ఆర్ అండ్ బి అధికారులు ఇటు కాంట్రాక్టర్లు ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు.వర్షపు నీరు బయటకు వెళ్లేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## పెడన యూ.పీ.హెచ్. సి పరిధిలో 4.వ సచివాలయం లోఫీవర్ సర్వే



**పెడన ఆగస్టు 20(మీ వార్త ప్రతినిధి)** పెడన యూ.పీ.హెచ్. సి పరిధిలో 4.వ సచివాలయం లో 13.వార్డు, 14వార్డు లో ఫీవర్ సర్వే, బ్లీచింగ్ మరియు మలతిన్ స్ప్రేయింగ్ మున్సిపల్ సిబ్బంది తో హెల్త్ స్టాఫ్ వార్డు లో చేయుంచటం జరిగింది. ఈ కార్యక్రమం లో హెల్త్ సూపర్ వైజర్ భట్రాజు సూరిబాబు, హెల్త్ అసిస్టెంట్ సతీష్ బాబు, ఆశ వర్కర్స్ లత, లక్ష్మి నరసమ్మ, ద్రాక్ష యని, మేరీ వరకుమారి, మరియు మున్సిపల్ సిబ్బంది హరి కిషోర్ సెక్రటరీ, వర్కర్ నాగభూషణం పాల్గొన్నారు

## దివంగత శ్రీ పుప్పాల సూర్య నారాయణ కుటుంబ సభ్యులను పరామర్శ

పెడన నియోజకవర్గ జనసేన పార్టీ సీనియర్ నాయకులు శ్రీ లింగం నాగేశ్వరరావు



**కృత్తివెన్ను ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం గాంధీ నగర్ (వన్నార) గ్రామానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, మాజీ సర్పంచ్ శ్రీ పుప్పాల సూర్య నారాయణ గారు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు.
వారి మరణ వార్త తెలుసుకున్న శ్రీ లింగం నాగేశ్వరరావు గారు ఆ రోజే వారి కుటుంబ సభ్యులను ఫోన్ లో పరామర్శించిగా, ఈ రోజు గాంధీ నగర్ (వన్నార) గ్రామంలో ఉన్న వారి స్వగృహానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి , మృతికి గల కారణాలు తెలుసుకున్నారు. అనంతరం వారి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో స్వర్గీయ నారాయణ రావు గారి కుమారులు పుప్పాల నరసింహ రావు, గాంధీ, భీమాంజనేయులు గార్లతో పాటు జనసేన నాయకులు జనసైనికులు పాల్గొన్నారు.

## ప్రజా తీర్పుతోనే నగరం,పట్టణ పాలన: ఎమ్మెల్యే బొలిశెట్టి

4వ సవరణ బిల్లు సవరణ ను స్వాగతిస్తున్నా



**అమరావతి ఆగస్టు 19 (మీ వార్త ప్రతినిధి)** నగర మేయర్లు,మున్సిపల్ చైర్మన్ లను ప్రజలే నేరుగా ఎన్నుకునేలా చట్టసభలలో సవరణ చేయడం చారిత్రక నిర్ణయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు.బుధవారం అసెంబ్లీ సమావేశాలలో మాట్లాడిన ఆయన నగర పంచాయతీలో మేయర్,పురపాలక సంఘాల్లో చైర్మన్ పదవులకు తమకు నచ్చిన వ్యక్తిని ప్రజలే ఎన్నుకునేలా ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనముల 4వ సవరణ బిల్లును స్వాగతిస్తూ ఆయన తన సంపూర్ణ మద్దతు తెలిపారు.నిస్వార్థంగా ప్రజలకు సేవ చేసే వారికి తగిన గుర్తింపు లభించడం లేదన్నారు. ఈ బిల్లు అమలుతో నిజంగా ప్రజలకు సేవ చేసే వారిని ప్రజలే గుర్తించి నేరుగా ఎన్నుకునే అవకాశం కల్పించడం చారిత్రక నిర్ణయం అని కొనియాడారు.పరోక్ష ఎన్నికలు కాదని, ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చైర్మన్, మేయర్లను ఎన్నుకునే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారాయణ కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజా ఆమోదంతో ప్రత్యక్షంగా చైర్మన్ లేదా మేయర్ ఎన్నిక కాబడినప్పుడు ఒత్తిడి తగ్గి ప్రజా ప్రయోజనకరమైన నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు.తద్వారా ప్రజలకు మేలు చేసే అవకాశం కల్పించబడుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రజలకే నిర్ణయాధికారాలు కల్పించడం అంటే అది దేశ చరిత్రలోనే ఆంధ్రప్రదేశ్ గర్వించదగ్గ విషయమని ఆయన పేర్కొన్నారు.

## జడ్పీ హైస్కూల్లో పిఎస్ టీచర్ కు దరఖాస్తుల ఆహ్వానం..

ఎంఈఓ శ్రీనివాస్.



**జీలుగుమిల్లి. (మీ వార్త ప్రతినిధి)** జీలుగుమిల్లి జడ్పీ హైస్కూల్లో 2026 -27 విద్యా సంవత్సరంలో తాత్కాలిక ప్రతిపాదికన ( పిఎస్) ఫిజికల్ సైన్స్ సబ్జెక్టు బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి కే శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 నెలల కాలపరిమితికి ఫిజికల్ సైన్స్ బోధించేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తులు ఆఖరి తేదీ ఈ నెల 21వ తేదీ శుక్రవారం సాయంత్రం 5గంటల లోపు మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. .

## చిన్న బ్రహ్మయ్య చిత్రపటానికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్





**యర్రగొండపాలెం, ఆగస్టు 19 ( మీ వార్త ప్రతినిధి ):** రాష్ట్ర బీసీ సెల్ సెక్రటరీ మూడమంచు బాల గురవయ్య కుమారుడు చిన్న బ్రహ్మయ్య ఇటీవల అనారోగ్య కారణం గా మృతి చెందారు. బుధవారం దశదిన కర్మ కార్యక్రమానికి యర్రగొండపాలెం నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ హాజరై అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కుటుంబంతో పార్టీకి ఉన్న సుదీర్ఘ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బాల గురవయ్య తో పాటు వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తమ గాఢ సానుభూతిని తెలియజేసి ధైర్యంగా ఉండమని భరోసా ఇచ్చారు..ఈ కార్యక్రమంలో మండల వైస్సార్సీపీ కన్వీనర్ ముసలారెడ్డి, గ్రామ సర్పంచ్ అరుణ భాయ్ జడ్పీటీసీ చేదురి విజయభాస్కర్ నియోజకవర్గ వైస్సార్సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చేవెంద్ర , కమలాపురం గ్రామాలలో పొలం పిలుస్తుంది






**పెడన ఆగస్టు 19(మీ వార్త ప్రతినిధి)** ఈరోజు కాకర్లమూడి గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులకు మిత్ర పురుగులు మరియు శత్రు పురుగుల గురించి వివరంగా చెప్పడం జరిగింది. మిత్ర పురుగుల అనగా వరి పంటలో రైతుకు పంటను ఆశించే శత్రు పురుగులను నాశనం చేయడానికి సహాయం చేసేవి, ఉదాహరణకు అక్షింతల పురుగు, అల్లిక రెక్కల పురుగు, సాలీడులు, శకట పురుగు, సూది తుమ్మెద, డ్రాగన్ ఫ్లైస్, ట్రైకో గ్రామ మరియు బదనికలు అని వివరించడం జరిగినది. పొలంబడి కార్యక్రమం ప్రాముఖ్యతను వివరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యవసాయ అధికారి సజ్జా.జెన్నీ, గ్రామ వ్యవసాయ సహాయకులు కుమార్ బాబు మరియు కాకర్లమూడి గ్రామ రైతులు పాల్గొన్నారు

## ఎస్పీ అద్నాన్ నయీమ్ అశ్మి ను కలిసిన కార్మిక బోర్డు చైర్మన్ వలవల బాబ్జి



**భీమవరం ఆగస్టు 19 (మీ వార్త ప్రతినిధి)** పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ పి) అద్నాన్ నయీమ్ అస్మి ని ఏపీ భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్, టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇంచార్జ్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి), బుధవారం భీమవరంలోని ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు బాబ్జి పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వలవల బాబ్జి తో పాటు ముదునూరు సొసైటీ చైర్మన్ దాసరి అప్పన్న ఎస్పీని కలిశారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు టీడీపీ శ్రేణులు సమరశంఖం పూరించాలి





పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలి

టీడీపీ సీనియర్ నేత వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ పిలుపు

రామచంద్రపురం: రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా పూర్తి స్థాయిలో సంసిద్ధం కావాలని టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పిలుపునిచ్చారు. రామచంద్రపురం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన అధ్యక్షతన నియోజకవర్గస్థాయి పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ.. పార్టీ బలోపేతం కోసం ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త చిత్త శుద్ధితో, సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామస్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు పార్టీ యంత్రాంగాన్ని మరింత పటిష్టం చేయాలన్నారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ది పొందుతున్న ప్రతి కుటుంబాన్ని కలిసి, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. టీడీపీకి కార్యకర్తలే వెన్నెముక అని పేర్కొన్న వాసంశెట్టి సత్యం.. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను గుర్తించి, వారికి తగిన ప్రాధాన్యత, గౌరవం కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ విజయానికి కృషి చేసే నాయకులు, కార్యకర్తలకు భవిష్యత్తులో సముచిత గుర్తింపు లభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ నాయకత్వంలో రామచంద్రపురం నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని, ఈ అభివృద్ధి ఫలాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. నాయకులు, కార్యకర్తలు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ పార్టీకి మంచి పేరు, ప్రఖ్యాతులు తీసుకురావాలని కోరారు. ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను ఎదుర్కొనేందుకు టీడీపీ శ్రేణులు ఇప్పటి నుంచే క్షేత్రస్థాయిలో కార్యాచరణ ప్రారంభించాలని అన్నారు. ప్రతి బూత్‌ను బలోపేతం చేసి, ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. నాయకత్వం ఇచ్చే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కార్యకర్తలు ముందుండాలని పిలుపునిచ్చారు. పట్టణ అధ్యక్షులు ఉండవల్లి శివ, రూరల్ మండల అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనుబాబు, కాజులూరు మండల అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కే.గంగవరం మండల అధ్యక్షులు మేడిశెట్టి రవికుమార్, స్వచ్ఛ ఆంధ్ర డైరెక్టర్ సలాది రమేష్ తదితరులు మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు సమష్టిగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీలు,క్లస్టర్, కో-క్లస్టర్, సొసైటీ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, యూనిట్, బూత్ స్థాయి సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రానున్న ఎన్నికలకు పార్టీని విజయపథంలో నడిపించేందుకు తమ పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# ఈగల్ కార్యక్రమం ద్వారా గంజాయి నిర్మూలనపై అవగాహన.







పల్లె బాటలో ఈగల్ టీం.

టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ టి.ధనుంజనాయుడు.

**అనంతగిరి,ఆగస్టు 19 ( మీ వార్త )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని గంజాయి రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలనే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా,అక్రమ గంజాయి సాగును పూర్తిగా నిర్మూలించేందుకు ఈగల్ ఐ.జి.పి.ఆకే రవి కృష్ణ, ఐ పి ఎస్ ,కె.ఎం మహేశ్వరరాజు ఐ పి ఎస్,ఎస్పీ (ఒపీఎస్),జి.స్వరూప రాణి,ఎస్పీ (అడ్మిన్ ),సి హెచ్.శ్రీనివాసరావు (ఎస్పీ )ఆదేశాల మేరకు ఈగల్ టాస్కఫోర్స్ ఇన్స్పెక్టర్ టి.ధనుంజనాయుడు, ఆధ్వర్యంలో అల్లూరి జిల్లా,అనంతగిరి మండలం,మరియు అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలో కొండిబ,సింగరబ్బా,కాశిపట్నం గ్రామలలో ఉన్న ప్రజలకు పల్లెబాటలో ఈగల్ కార్యక్రమం లో భాగంగా ఆపరేషన్ చైతన్యం గురించి అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యం జిల్లాలో "జీరో గంజాయి సాగు" కొనసాగించటం.ఆ గ్రామంలో ఈగల్ వారి ఆపరేషన్ చైతన్యం అనే విశిష్ట కార్యక్రమం అమలులో భాగంగా ఐటీడీఏ/నాంది ఫౌండేషన్ వారి ప్రత్యామ్నాయ మొక్కల పంపకంలో పాలుపంచుకుని ప్రభుత్వంచే చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమ గొప్పతనాన్ని వివరించడంతో ఈగల్ ఆ గ్రామ ప్రజల మన్ననలు పొందడం జరిగింది.ఈగల్ కి సంబంధించిన ఆపరేషన్ చైతన్యం,ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ జోన్,ఆపరేషన్ గరుడ,ఆపరేషన్ ట్రైన్స్,ఆపరేషన్ వజ్రప్రహర్ గురించి వివరించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామ ప్రజల కు డ్రగ్స్ దుర్వినియోగం మరియు గంజాయి వంటి మాదక ద్రవ్యాల వలన కలిగే దుష్పరిణామాలు,శారీరక మరియు మానసిక ఆరోగ్యంపై చూపే ప్రభావాలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు.ఎన్ డి పీ ఎస్ చట్టం 1985 కింద కేసులలో ఇరుక్కుంటే ఎదురయ్యే పరిణామాలు మరియు శిక్షల గురించి స్పష్టంగా తెలియజేయడమైనది.గంజాయి సంబంధిత కదలికలపై ఎటువంటి సమాచారమున్నా వారిని 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం ఇవ్వాలని వారి యొక్క వివరములను గోప్యంగా ఉంచబడతాయి అని తెలపడమైనది.ఈగల్ టాస్కఫోర్స్ టీమ్ విశాఖపట్నం...కార్యక్రమంలో ఈగల్ టాస్కఫోర్స్ సిబ్బంది,కొండిబ గ్రామ పెద్దలు గుజ్జెల మధుసూదన్,శ్యామ్,పోతురాజు,కొండప్ప,రామరాజు,మోహనరావు,కోమందన్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అనంతగిరిలో పశువుల యజమానులకు పంచాయతీ హెచ్చరిక.

నిర్లక్ష్యం వహిస్తే పశువుల స్వాధీనం..!

**అనంతగిరి,ఆగస్టు 19 ( మీ వార్త )** రైతులు తమ పశువులను నిర్లక్ష్యంగా వదిలేస్తే గ్రామ పంచాయతీ పరంగా కఠిన చర్యలు తప్పవని అనంతగిరి గ్రామ పంచాయతీ కార్యదర్శి దేవా ప్రజలను హెచ్చరించారు.కొంతమంది రైతులకు సంబంధించిన పశువులు ఇతర రైతుల పంట పొలాల్లోకి వెళ్లి నష్టపరుస్తున్నాయంటూ వచ్చిన ఫిర్యాదులపై పంచాయతీ ఈ నిర్ణయం తీసుకుంది.ఈ సందర్భంగా సెక్రటరీ దేవా మాట్లాడుతూ..చాలామంది రైతులు పశువులను సరైన పోషణ,కాపలా లేకుండా వదిలేయడం వల్ల అటు రైతులకు,ఇటు ప్రజలకు,మూగజీవులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పశువులు ఇతర రైతుల పొలాల్లోకి చొరబడి పంటలను నాశనం చేస్తున్నాయి.రాత్రి వేళల్లో పశువులు మండల కేంద్రానికి వచ్చి రోడ్డుకు అడ్డంగా పడుకోవడం వల్ల వాహనదారులకు ఇబ్బంది కలుగుతోంది.కొన్నిసార్లు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం కూడా



సంభవిస్తోంది.సరైన సంరక్షణ లేక పశువులు జబ్బుపడి మండల కేంద్రంలోనే చనిపోయిన సందర్భాలు ఉన్నాయి.ఇకపై పశువులను నిర్లక్ష్యంగా బయటకు వదిలేసే యజమానులపై కింది విధంగా చర్యలు ఉంటాయని సెక్రటరీ స్పష్టం చేశారు.నిబంధనలు ఉల్లంఘిస్తే మొదటిగా మూడు సార్లు నోటీసు ద్వారా హెచ్చరిస్తారు.అప్పటికీ యజమానుల తీరు మారకపోతే



సదరు పశువులను గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకుంటుంది.సంబంధిత పశువుల యజమానులపై చట్టపరమైన చర్యలు కూడా ఉంటాయి.కావున అనంతగిరి ప్రజలు, పశువుల యజమానులు ఈ నోటీసును గమనించి, తమ పశువులకు సరైన కాపలా ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి దేవా విజ్ఞప్తి చేశారు.

## కరెన్సీ నోట్లుపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలి,,

**పాయకరావుపేట, ఆగస్ట్ 19** : మీ వార్త ప్రతినిధి,భారత ప్రభుత్వం నూతనంగా ముద్రిస్తోన్న కరెన్సీ నోట్లుపై భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటోను ముద్రించాలని కోరుతూ పాయకరావుపేట గ్రామ కాపురస్థుడు, జాతీయ బీసీ, ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్ మరియు మైనార్టీల సంఘ సభ్యుడు, ప్రముఖ న్యాయవాది డాక్టర్ బిఏఆర్ అంబేద్కర్ తహసీల్దారు శివకోటి ఆది మహేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది అంబేద్కర్ మాట్లాడుతూ... భారతదేశానికి దిశ, దశ నిర్దేశించిన రాజ్యాంగ నిర్మాత, మన దేశానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను తీసుకొచ్చిన చరిత్ర కలిగిన మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఫోటోను కరెన్సీ నోట్లపై ముద్రించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ స్థలాలలో శాశ్వత నిర్మాణం చేపట్టిన కార్యాలయాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఈ స్థలాలలో ఏర్పాటు చేసుకున్న కార్పోరేట్ విద్యా సంస్థలలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జ్యోతిరావు పూలే విగ్రహాలను ఏర్పాటు చేయాలని అంబేద్కర్ కోరారు.



## ఆకులమన్నాడు లో మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో

డోర్ టు డోర్ కార్యక్రమం...

**గూడూరు, ఆగష్టు19(మీ వార్త ప్రతినిధి)** గూడూరు మండలం ఆకులమన్నాడు గ్రామంలో పెడన శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ ఆదేశానుసారం ఆకులమన్నాడు మాజీ సర్పంచ్ మహ్మద్ రఫీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో చేసిన అభివృద్ధిని ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరిస్తూ డోర్ టు డోర్ తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.





ఈ సందర్భంగా ఆకులమన్నాడు గ్రామానికి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో నివాసానికి పనికిరాని స్థలాలలో తమకు పట్టాలని ఏర్పాటు చేశారని నివాసయోగ్యమైన స్థలాలలో పట్టాలు ఇప్పించే ఏర్పాటు కూటమి ప్రభుత్వంలో చేయాలని నాయకుల దృష్టికి గ్రామస్తులు తీసుకుని వచ్చారు. పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ దృష్టికి సమస్యను తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని నాయకులు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహమ్మద్ రఫీ తో పాటు గూడూరు మండల టిడిపి అధ్యక్షుడు గోపి నాగబాబు, ఆకులమన్నాడు పిఎసిఎస్ చైర్మన్ ఎజ్జు శివాజీ, అజీమ్ బాషి, బర్కతుల్లా, మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు...

## నిర్మాణ పనులకు ముందడుగు



డుంబ్రిగూడ, ఆగస్టు 19 ( మీ వార్త విలేఖరి ): మండల పరిధిలోని రంగిలిసింగి పంచాయతీ పరిధిలో బుధవారం పీసా కమిటీ సభ్యులు అగతమ్మిడి ధర్మారావు టిడిపి కార్యకర్తలు అగతమ్మిడి త్రినాధ రావు మరియు పాంగి నాగేశ్వరావు కలిసి డ్రైనేజీ కాలువ మరియు సిమెంట్ రోడ్లు అంచనా నిమిత్తం ఇంజినీరింగ్ అసిస్టెంట్ కిల్లో రవి ప్రపోజల్ పత్రాన్ని అందజేశారు.

## స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం,,







**పాయకరావుపేట, మీ వార్తా ప్రతినిధి,,ఆగస్ట్ 19** : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలు 49 వసంతాలు పూర్తి చేసుకొని 50 వ సంవత్సరంలోకి అడుగిడిన శుభసందర్భంలో 50 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో పాయకరావుపేట, తుని, అన్నవరం బ్రాంచ్ లలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి రక్తదానం చేశారు. విద్యార్థులు సమాజానికి ఉపయోగపడేలా సేవా దృక్పథం కలిగి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. 2004 నుంచి ఇప్పటివరకు సుమారు 3000 యూనిట్ల రక్తాన్ని ఇచ్చి తమ విద్యార్థులు, సిబ్బంది తమ సేవానిరతిని చాటుకున్నారన్నారు. ఈ శిబిరంలో సుమారు 400 మంది రక్తదానం చేసారన్నారు. ఈ సందర్భంగా 40 సార్లు కంటే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన పలువురుని ఈ సందర్భంగా జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ బ్లడ్ బ్యాంక్, డాక్టర్ పి.కామరాజు, రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ పరాసర్, మదర్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ సత్యన్నారాయణ, వీనస్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ సాల్మన్ రాజ్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, ఎన్ సి సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## గుంటపల్లిలో స్వచ్ఛ పథం కార్యక్రమం,,



**పాయకరావుపేట, ఆగస్ట్ 19** : ,, మీ వార్త ప్రతినిధి,,మండలంలోని గుంటపల్లిలో బుధవారం స్వచ్ఛ పథం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్పెషల్ ఆఫీసర్ శరత్ బాబు మాట్లాడుతూ... ప్రజలు చెత్తను రోడ్డు మీద వేయరాదనీ, ప్లాస్టిక్ వాడకం తగ్గించాలనీ గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామ ప్రజలు అందరూ స్వచ్ఛందంగా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం బుజ్జి, జనసేన పార్టీ సీనియర్ నాయకులు పల్లి దుర్గారావు, డిప్యూటీ ఎంపిడిఓ వైవి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



# మహిళలకు స్ఫూర్తినిస్తుంది

'అమీర్‌లోగ్' చిత్రంలో తాను పోషించిన పాత్ర మహిళలకు స్ఫూర్తినిచ్చేలా ఉంటుందని చెప్పింది కథానాయిక వేదా జలంధర్. హైదరాబాద్ బస్తీ నేపథ్య కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రానికి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ నెల 21న రానా 'స్పిరిట్' మీడియా ద్వారా ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా బుధవారం చిత్ర కథానాయిక వేదా జలంధర్ పాత్రికేయులతో ముచ్చటించింది. ఈ సినిమాలో తాను పక్కింటి అమ్మాయి తరహా పాత్రలో కనిపిస్తానని, ముక్కసూటిగా మాట్లాడటం తన నైజమని చెప్పింది. 'ఈ సినిమా రిలీజైన తర్వాత ప్రతీ ఒక్కరూ నా పాత్ర గురించి మాట్లాడుతారు. హైదరాబాద్ నేటివిటీని ప్రతిబింబించే అద్భుతమైన కథ ఇది. ప్రతీ పాత్రతో ప్రేక్షకులు కనెక్ట్ అవుతారు. ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఆరేళ్లయింది. 'అమీర్‌లోగ్' తప్పకుండా నా కెరీర్‌కు బ్రేక్‌నిస్తుందనే నమ్మకం ఉంది' అని వేదా జలంధర్ తెలిపింది

# మోడ్రన్ మిస్సమ్మ కథ



హర్ష నర్రా, తన్మయి, ఖుషి, సిజు ఏఆర్ తదితరులు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మోడ్రన్ మిస్సమ్మ'. సాయిబాబా దర్శకుడు. లాస్య అండ్ మిథున క్రియేషన్స్ తెరకెక్కిస్తున్నాయి. బుధవారం ఈ సినిమాలోని 'బెటర్ బీ ఏ మిస్సమ్మ' అనే తొలిపాటను విడుదల చేశారు. గోపీ సుందర్ స్వరపరచిన ఈ పాటను కిట్టు విస్సాప్రగడ రచించారు. 'కథపై నమ్మకంతో ఈ సినిమాకు 'మోడ్రన్ మిస్సమ్మ' అనే టైటిల్ పెట్టాం. పెళ్లి నేపథ్యంలో ఆద్యంతం ఆసక్తికరంగా సాగే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేశాం' అని దర్శకుడు తెలిపారు. నేటి ట్రెండ్‌కు తగిన సినిమా ఇదని నిర్మాత చిరంజీవి పమిడి పేర్కొన్నారు.కొ




# అక్కినేని త్రయం అదరగొట్టే లుక్స్..

## 'వెరైటీ ఇండియా' మ్యాగజైన్ కవర్‌పై నాగ్, చైతూ, అఖిల్!

భారతీయ చలనచిత్ర పరిశ్రమలో 90 ఏళ్ల ఘనమైన కుటుంబ వారసత్వాన్ని ముందుకు తీసుకువెళ్తున్న అక్కినేని త్రయం (అక్కినేని నాగార్జున, నాగ చైతన్య, అఖిల్) తాజాగా సరికొత్త స్టైలిష్ లుక్స్‌తో అదరగొట్టారు. ప్రముఖ అంతర్జాతీయ వినోద మీడియా సంస్థ 'వెరైటీ ఇండియా' రెండో ఎడిషన్ కవర్ పేజీపై ఈ ముగ్గురు హీరోలు మెరిశారు. అతి త్వరలో రాబోయే ఈ ప్రత్యేక సంచిక కోసం అక్కినేని హీరోలు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ ఇంటర్వ్యూలో వారు సినిమా రంగంలో తమ కుటుంబం సాధించిన అరుదైన విజయాలు, తొమ్మిది దశాబ్దాల సినీ ప్రయాణం, నాటి అనుభవాలు మరియు నేటి తరానికి సంబంధించిన ఆసక్తికరమైన విశేషాలను పంచుకున్నారు. అత్యంత ఆకర్షణీయమైన దుస్తుల్లో, స్టైలిష్ అప్పియరెన్స్‌తో ఉన్న ఈ అక్కినేని హీరోల ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

# వెంకటేశ్-కల్యాణ్‌రామ్ మూవీకి క్రేజీ టైటిల్.. 'జనవరి 12 విడుదల'

అనిల్ రావిపూడి ప్రమోషన్స్ అంటే మామూలుగా ఉండవు..తన సినిమాల ప్రచారంలోనూ కొత్తదనం చూపించే ఆయన.. తాజాగా మరోసారి తనదైన స్టైల్‌లో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. వెంకటేశ్, నందమూరి కల్యాణ్‌రామ్ కీలక పాత్రల్లో తెరకెక్కుతున్న సినిమాకు టైటిల్ ప్రకటించే విషయంలోనూ ఓ ఫన్నీ ఐడియాను తీసుకొచ్చారు. టైటిల్‌తో పాటు సినిమా విడుదల తేదీని కూడా ఒకేసారి రివీల్ చేసి ఆసక్తి పెంచారు. అనిల్ రావిపూడి దర్శకత్వంలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ హీరోలుగా ఓ సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. కీర్తి సురేశ్, కృతి శెట్టి కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్ బావా బామ్మర్ది పాత్రల్లో కనిపించనున్నట్లు తెలుస్తోంది. దీంతో ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చే ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. తాజాగా చిత్రబృందం సినిమా టైటిల్‌ను అధికారికంగా ప్రకటించింది. 'జనవరి 12 విడుదల' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేసింది. అంతేకాదు.. 'బావ బామ్మర్ది సౌజన్యంతో' అనే క్యాప్షన్‌ను కూడా జత చేసింది. టైటిల్ వినగానే ఇది సినిమా విడుదల తేదీ అనుకుంటే.. అదే సినిమా పేరుగా ఉండటం విశేషం. టైటిల్ ప్రకటన కోసం రూపొందించిన వీడియోలో వెంకటేశ్, కల్యాణ్‌రామ్, కీర్తి సురేశ్, కృతి శెట్టి.. అనిల్ రావిపూడిని సినిమా పేరేంటని అడుగుతారు. అందుకు ఆయన పదే పదే 'జనవరి 12 విడుదల' అని చెబుతుంటారు. తొలుత అది రిలీజ్ డేట్ అని భావించిన హీరోలు.. చివర్లో అదే సినిమా టైటిల్ అని తెలుసుకుని సరదాగా స్పందిస్తారు. టైటిల్ రివీల్ వీడియోలో దర్శకుడు అనిల్ రావిపూడి ప్రముఖ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ప్రత్యేకంగా నివాళి అర్పించారు. ఈవీవీ తెరకెక్కించిన 'అప్పుల అప్పారావు'లోని కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా వీడియోను రూపొందించారు. ఇలా తన కామెడీ మార్క్‌తో పాటు పాత తరం హాస్యాన్ని కలిపి టైటిల్ అనౌన్స్‌మెంట్‌ను కూడా ఓ ఎంటర్‌టైనింగ్ వీడియోగా మార్చారు.




Edited Printed Published & Owned by U. SHEKHAR. And Printed at Mani Raghava Printers, #A-20, Vambay Colony, Hyderabad, Rajendranagar, Rangareddy, Telangana.
Published at Manikanta Publications, H.No. 3-67/3/66, Netaji Nagar, Nallagandla, Serilingampally, Rangareddy (Dist), Telangana, EDITOR U.SHEKHAR, RNI. NO. TEL/2018/77112